PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి


ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 170 | విజయవాడ, గురువారం 25 జనవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 25 January 2024 | Rs



ఈబేలో వెయ్యి మందిపై వేటు

లోపలి పేజీలో..

చంద్రబాబు బెయిల్‌ను రద్దు చేయండి

- సుప్రీంలో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టిడిపి అధినేత చంద్రబాబు బెయిల్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఐఆర్ఆర్ కేసులో ఈనెల 10న చంద్రబాబుకు రాష్ట్ర హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పును ఏపి ప్రభుత్వం సుప్రీంలో సవాలు చేసింది. చంద్రబాబు బయట ఉంటే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని ఏపి ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ పిటిషన్ ఈనెల 29న విచారణకు వచ్చే అవకాశం ఉంది. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కేసులో అక్రమాలు జరిగాయని జగన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ మేరకు గత ప్రభుత్వ హయాంలో స్కాం జరిగిందని సిఐడి కేసు నమోదు చేసింది.



విమాన శకలాలు పరిశీలిస్తున్న రష్యా అధికారులు

ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలో కూలిన రష్యా విమానం

65 మంది ఖైదీలతో సహా 74 మంది మృతి

మాస్కో : పలువురు ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలను తీసుకుని వెళ్తున్న రష్యన్ భారీ సైనిక రవాణా విమానం ఐఎల్-76 బుధవారం ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలోని బెల్గొరాడ్ ప్రాంతంలో కూలిపోయింది. దీంతో అందులో ఉన్న 65మంది ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలు చనిపోయారు. పరస్పర ఖైదీల మార్పిడి కింద వీరిని ఉక్రెయిన్‌కు అప్పగించేందుకు తీసుకెళ్తుండగా ఈ దారుణం చోటు చేసుకున్నట్లు ఆ ప్రాంత గవర్నర్ తెలిపారు.

ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించేందుకు విమానం కూలిన ప్రాంతానికి ప్రత్యేక మిలటరీ కమిషన్ వెళుతోందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ ఖైదీలతో పాటూ మరో ముగ్గురు వ్యక్తులు, ఆరుగురు సిబ్బంది కూడా విమానంలో వున్నారని తెలిపింది.. మంచుతో కప్పబడిన గ్రామీణ ప్రాంతంలో ఆకాశం నుండి విమానం పడిపోతుండడం, నేలను తాకగానే పెద్ద అగ్ని గోళంలా మండుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.. ఉక్రెయిన్ బలగాలు ప్రయోగించిన క్షిపణుల వల్లనే ఈ విమానం కూలిపోయిందని రష్యా పార్లమెంట్‌కి చెందిన ఇద్దరు సీనియర్ సభ్యులు ఆరోపించారు. యుద్ధ ఖైదీలకు సంబంధించిన ఉక్రెయిన్ కో ఆర్డినేషన్ హెడ్‌క్వార్టర్స్ దీనిపై స్పందిస్తూ, విమానం కూలిపోయినట్లు కనిపిస్తోందని పేర్కొంది. అంతకుమించి ఎలాంటి సమాచారాన్ని ఇవ్వలేదు. నిర్ధారించబడని సమాచారం పంచుకోరాదంటూ హెచ్చరించింది. రష్యన్ ఎంపి ఆండ్రీ కార్తాపోలోవ్ మాట్లాడుతూ, ఉక్రెయిన్ ఖైదీలను రెండు విమానాలు తీసుకెళుతున్నాయని, 80మంది ఖైదీలు వున్న రెండో ఐఎల్-76 విమానాన్ని ప్రమాద ప్రాంతం నుండి మాస్కో అత్యవసరంగా మళ్లించాల్సి వచ్చిందని తెలిపారు.

ఉపాధ్యాయుల ముందస్తు అరెస్టు

- 'చలో విజయవాడ' వెళ్లనీయకుండా పోలీసుల నిర్బంధం 2

తుది ఓటర్ల జాబితాపైనా

అభ్యంతరాలు వ్యక్తం చేయొచ్చు

- హైకోర్టులో సిఇసి నివేదిక

ప్రజాశక్తి-అమరావతి

ఓటర్ల తుది జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయవచ్చునని, అభ్యంతరాలను స్వీకరించి కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) తగిన నిర్ణయం తీసుకుంటుందని హైకోర్టుకు సిఇసి నివేదించింది. ఇప్పటికే ఓటర్ల జాబితా విడుదల చేశామని చెప్పింది. ఇప్పటి వరకు అందిన అభ్యంతరాలపై చట్ట ప్రకారం సవరణ చేసి తుది జాబితా విడుదల చేసినట్లు నివేదించింది. ఈ వివరాలతో సంతృప్తి చెందిన హైకోర్టు, మచిలీపట్నంలో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయనే పిల్‌పై విచారణను ముగిస్తున్నట్లు ప్రకటించింది.

ఒక ఇంట్లో నివాసం ఉండే ఓటర్లందరికీ ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు కల్పించాలని, అర్హులకు ఓటు హక్కు నిరాకరించకుండా ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలంటూ మచిలీపట్నంకు చెందిన వ్యాపారి ఇ దిలీప్‌కుమార్ వేసిన పిల్‌ను బుధవారం చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ పూర్తి చేసింది. పిటిషనరు తరపున న్యాయవాది ఎంవి రమణ కుమారి వాదిస్తూ.. ఒక ఇంట్లోని ఒక కుటుంబానికి చెందిన వాళ్ల ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చేయలేదన్నారు. నివాసం ఉన్నవారు రెండు కిలోమీటర్ల పరిధిలోనే పోలింగ్ బూత్ ఉండాలన్న సిఇసి నిబంధన అమలు కావడం లేదన్నారు. సిఇసి తరపున సీనియర్ న్యాయవాది దేశాయ్ అవినాష్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ, తాజాగా విడుదల చేసిన తుది జాబితాపై అభ్యంతరాలు తెలియజేయొచ్చునని చెప్పారు.

రైతులు నో చెప్పినా నానో

- ఈ ఏడాది 5.94 లక్షల బాటిల్స్
- 3 లక్షల టన్నుల సాధారణ ఎరువుకు కోత
- బలవంతపు పిఎం ప్రణామ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఏమాత్రం శాస్త్రీయత రుజువుకాని నానో యూరియాను కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రైతులకు బలవంతంగా అంటగట్టింది. రైతులు పంటల సాగుకు సాధారణంగా ఉపయోగించే యూరియా కేటాయింపులను దిగ్గోసి ఆ మేరకు నానో యూరియాతో భర్తీ చేసింది. 2023-24లో ఘన రూపంలో బస్తాల్లో సరఫరా చేసే యూరియా కేటాయింపుల్లో సుమారు మూడు లక్షల టన్నులకు కోత పెట్టి అందుకు బదులుగా 5.94 లక్షల లిక్విడ్ యూరియా బాటిల్స్‌ను ప్రతిపాదించింది. రైతుల్లో ఆదరణ లేనందున ప్రైవేట్ డీలర్లు, దుకాణదారులు నానో యూరియాను తిరస్కరిస్తున్నారు. బలవంతంగా రుద్దిన యూరియా బాటిల్స్ సేల్ కావట్లేదని అసహనం చెందుతున్నారు. పెద్ద ఎత్తున సీసాలు పేరుకుపోయాయని ఆందోళన చెందుతున్నారు. కాగా కేంద్రం ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె)లో నానో ఎరువులను రైతులకు అంటగట్టేందుకు సిద్ధమైంది. రాష్ట్ర సర్కారు ఆర్‌బికెలకు పంపిన నానో యూరియా సేల్ కాక మూలన పడేసినట్లు తెలుస్తోంది. కేంద్రం కోతలతో ఆనవాయితీగా వాడుతున్న యూరియా అదనుకు దొరక్క ఈ ఏడాది ఖరీఫ్, రబీలలో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

కేంద్రం బలవంతం

ఎరువుల సబ్సిడీని తగ్గించుకునేందుకు మోడీ ప్రభుత్వం 'పిఎం ప్రణామ్' ప్రాజెక్టును దేశ వ్యాప్తంగా అమలు చేస్తోంది. పిఎం ప్రణామ్ అంటే...

శాస్త్రీయంగా రుజువుకాని యూరియా



ప్రధానమంత్రి ప్రోగ్రాం ఫర్ రిస్టోరేషన్, అవేర్‌నెస్ జనరేషన్, న్యూట్రియంట్ అండ్ ఎమోలియరేషన్ ఆఫ్ మోనిటర్ ఎర్త్. రసాయన ఎరువుల వినియోగం తగ్గించడం ద్వారా భూమి తల్లిని, పర్యావరణాన్ని రక్షిస్తామంటోంది కేంద్ర సర్కారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రీయ, జీవ, పచ్చిరొట్ట, నానో ఎరువులను ప్రోత్సహిస్తామంది. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులకు అలవాటు చేస్తామంది. అందులో భాగంగా 2023-24 నుంచి 2025-26 మూడేళ్ల కాలానికి ఎపిలో రైతుల చేత రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు టార్గెట్లు విధించింది. అందుకు తలొగ్గిన రాష్ట్ర సర్కారు ఈ సంవత్సరం ఖరీఫ్, రబీలలో 5,94,000 నానో యూరియా బాటిల్స్ అమ్మకాలకు ప్రణాళిక వేసింది. కేంద్ర సూచనలకనుగుణంగా రాష్ట్రంలో మూడు సంవత్సరాల యూరియా వినియోగాన్ని పరిగణనలోకి తీసుకొని సగటు గణించి, దానిలో 3.69 శాతం తగ్గించాలని లక్ష్యాలు రూపొందించింది. ఆ మేరకు రాష్ట్రానికి కేటాయించే ఘన యూరియా కేటాయింపుల్లో 3 లక్షల టన్నుల వరకు కోత పెట్టింది.

అశాస్త్రీయం


మామూలుగా రైతులు ఉపయోగించే 45 కిలోల బస్తా యూరియాకు బదులు ద్రవ రూపంలో ఉండే 500 మిల్లీలీటర్ల నానో యూరియా సీసా సరిపోతుందని, ఘన రూపంలో ఉండే ఎరువు కంటే ద్రవ రూపంలో ఉండే ఎరువు మొక్కలు గ్రహించడానికి వీలుగా ఉంటుందని కేంద్రం పేర్కొంది. ఇది అశాస్త్రీయమని, మిగతా 7లో

ఈ ఏడాది జిల్లాల వారిగా నానో యూరియా కేటాయింపు (బాటిళ్లలో..)

శ్రీకాకుళం	22,506	పశ్చిమగోదావరి	23,474	కర్నూలు	32,516
విజయనగరం	18.634	ఏలూరు	33,968	నంద్యాల	38,874
మన్యం	11.484	కృష్ణా	24,838	అనంతపురం	19,690
అల్లూరి	3.542	ఎన్‌టిఆర్	23,662	సత్యసాయి	8,888
విశాఖపట్నం	1,540	గుంటూరు	32,780	వైఎస్ఆర్	19,162
అనకాపల్లి	13,200	బాపట్ల	31.350	అన్నమయ్య	12,144
కోనసీమ	22,418	పల్నాడు	40.106	చిత్తూరు	13,882
కాకినాడ	17,864	ప్రకాశం	19,426	తిరుపతి	31,614
తూర్పుగోదావరి	32,230	నెల్లూరు	43,208	**మొత్తం**	**5,94,000**

బిజెపికి అంశాల వారీ మద్దతు

- మాకు టిడిపి-జనసేన మధ్యే పోటీ
- కాంగ్రెస్‌ది డర్టీ గేమ్ ఎన్నికల్లో మేమే గెలుస్తాం
- ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్, డిబేట్‌లో జగన్



ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్, డిబేట్‌లో మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

బిజెపికి తాము అంశాల వారీగా మద్దతు ఇస్తున్నామని, అదే విధంగా వారి నుండి సహకారం పొందుతున్నామని, ఎన్నికల తరువాత కూడా ఇదే విధానం కొనసాగుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. తిరుపతిలోని తాజ్ హోటల్లో బుధవారం సాయంత్రం ఇండియా టుడే నిర్వహించిన ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో ఆయన ముఖ్యఅతిగా పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ నిర్వహించిన డిబేట్లో జగన్ మాట్లాడారు. విద్యారంగ విషయాలతో పాటు పలు ఇతర అంశాలను ఈ కార్యక్రమంలో ఆయన ప్రస్తావించారు. బిజెపితో సంబంధాల గురించి మాట్లాడుతూ కొన్ని అంశాల్లో తాము వారికి మద్దతిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో ప్రజల ప్రయోజనాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నామని చెప్పారు. 'జాతీయ రాజకీయాల్లో మా విధానం స్పష్టం' అని ఆయన అన్నారు. ఎన్నికల తరువాత కూడా ఇదే విధానంకొనసాగుతుందని అన్నారు. రాష్ట్రంలో జాతీయ పార్టీలైన బిజెపికి, కాంగ్రెస్ పార్టీకి చోటు లేదన్నారు. టిడిపి-జనసేన కూటమితోనే తమకు పోటీ ఉంటుందని చెప్పారు. ప్రజలు తమవైపే ఉన్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో తామే గెలుస్తామని చెప్పారు. అవినీతికి పాల్పడడం వల్లే చంద్రబాబును పోలీసులు అరెస్టు చేశారని అన్నారు. సాక్ష్యాధారాలు పక్కాగా ఉన్నాయని, వాటిని పోలీసులు కోర్టుకు సమర్పించారని, అందుకే 52 రోజులపాటు చంద్రబాబు జైల్లో ఉంచాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ డర్టీ గేమ్ ఆడుతుందని చెప్పారు. 'మా కుటుంబాన్ని మళ్లీ విడదీసేందుకు ప్రయత్నిస్తోంది.' అని అన్నారు. అందులో భాగంగానే తన సోదరి షర్మిలను ఎపి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమించిదని చెప్పారు. 'గతంలో మా బాబాయ్ వైఎస్.వివేకానందరెడ్డికి కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవి ఇచ్చి మాపై ప్రయోగించింది' అని చెప్పారను. కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధి కోసమే రాష్ట్రాన్ని విడదీసిందని విమర్శించారు.

విద్య ప్రతి ఒక్కరి హక్కు

నాణ్యమైన విద్య అందుకోవడం ప్రతి ఒక్కరి హక్కు కావాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలుస్తామని, బిజెపికి అంశాల వారీగా మద్దతు ఇస్తామని తెలిపారు. రాష్ట్ర విద్యా రంగంలో సమూల మార్పులు, విద్యా రంగంలో ఆంధ్ర మోడల్ తదితర అంశాల గురించి చర్చించారు.. పేదరికం తొలగించేందుకు చదువుపై పెట్టుబడి పెట్టడం మినహా మరో మార్గం లేదన్నది తన బలమైన నమ్మకమని తెలిపారు.



తృణమూల్, వామపక్షాలు కలిసే పరిస్థితే లేదు !

- రాష్ట్రాల స్థాయిలోనే సీట్ల సర్దుబాటు జరగాల్సి వుంది
- రోజువారీ సమస్యలే ఎన్నికల్లో ప్రభావం చూపిస్తాయి 7
- పత్రికా ఇంటర్వ్యూలో సీతారాం ఏచూరి

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి

అదానీ అంబానీని కాపాడేందుకు మతాన్ని సాధనంగా వాడుతున్నారు

- వైసిపి, టిడిపిలు మోడీ ముందు మోకరిల్లాయి
- ఎమ్మెల్యేలను ఐప్యాక్ మార్చడమా?
- కార్పొరేట్ రాజకీయ కంపెనీలను నిషేధించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలోనూ, రాష్ట్రంలోనూ మత ఉద్రిక్తతలు సృష్టించేందుకు కుట్ర జరుగుతోందని, దీనికోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నాయకులు, ప్రధాని మోడీ పథకం పన్నారని, అయోధ్య వ్యవహారం అందులో భాగమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.సీతారాంతో కలిసి శ్రీనివాసరావు మాట్లాడారు. అయోధ్యను మోడీమయం చేశారన్నారు. దేశంలో మతం పేరుతో జరుగుతున్న కుట్ర బయట దేశస్తులు, ఉగ్రవాదులు చేస్తోంది కాదని, అధికారంలో ఉన్న బిజెపి, మోడీ చేస్తున్నదేనని విమర్శించారు. దేశ ప్రజల సమస్యలు, జాతీయ సమైక్యత గురించి ఆలోచించకుండా మతోన్మాదంతో కొట్టుకునేలా చేస్తున్నారని అన్నారు. ఒకరినొకరు నిందించుకోవడం, విద్వేషాలు పెరగడం, ఫలితంగా దేశం బలహీనపడి ప్రపంచం ముందు తలదించుకునే పరిస్థితిని సృష్టిస్తున్నారని, ఈ విషయంలో మోడీ వైఖరిని సిపిఎం ఖండిస్తోందని తెలిపారు. దేశంలో ఎవరైనా దేవాలయాలు కట్టుకోవచ్చుని, వెళ్లచ్చుని, కానీ ప్రధాని స్వయంగా ఈ వ్యవహారన్ని నెత్తినేసుకున్నారని మిగతా 7లో



మంత్రి పెద్దిరెడ్డిని అడ్డుకొని వినతిపత్రం అందిస్తున్న వైసిపి నేతలు

బిల్లుల కోసం పెద్దిరెడ్డి అడ్డగింత

ప్రజాశక్తి- వి.కోట (చిత్తూరు జిల్లా)

తమకు నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం బకాయి ఉన్న నీటి బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్‌ని సొంత పార్టీకి చెందిన వైసిపి నేతలు చిత్తూరు జిల్లా వి.కోట మండలం దానమయ్య గారిపల్లి సమీపంలోని టోల్ ప్లాజా వద్ద బుధవారం అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాగునీటి ఎద్దడి నివారించే లక్ష్యంతో ట్యాంకర్లతో గ్రామాలకు నీటిని అందించామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన రూ.20 కోట్ల మేరకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని, పలుమార్లు అమరావతికి వెళ్లి వైసిపి అధినాయకత్వానికి విన్నవిచ్చినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. దీంతో, మంత్రి స్పందిస్తూ, బిల్లుల చెల్లింపునకు త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కుప్పం పర్యటనకు వెళ్లారు.

గ్రామీణ బంద్‌కు మద్దతు ఇవ్వండి

- ప్రజలకు రైతు, కార్మిక ఐక్య వేదిక పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈ నెల 26న జరిగే ట్రాక్టర్, ట్రాక్టర్ కవాతు, ఫిబ్రవరి 16న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌కు మద్దతు ఇవ్వాలని దేశ ప్రజలకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక విజ్ఞప్తి చేసింది. ఎస్‌కెఎం, కార్మిక సంఘాలు బుధవారం నాడిక్కడ ఈ మేరకు ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేశాయి. జీవనోపాధి సమస్యలను తిరిగి జాతీయ ఎజెండాలోకి తీసుకురావడానికి మద్దతుగా ఉండాలని విద్యార్థులు, యువత, మహిళలు, చిరు వ్యాపారులు, జర్నలిస్టులు, సాంస్కృతిక కార్యకర్తలకు ఎస్‌కెఎం, కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేశాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్, జనవరి 26 జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహన కవాతుకు ఎస్‌కెఎం ఇచ్చిన పిలుపునకు కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్‌లు, అసోసియేషన్లు ఇప్పటికే మద్దతు ప్రకటించాయి.

"మోడీ ప్రభుత్వంలో ప్రజలపై కార్పొరేట్, మతతత్వ శక్తుల నిరంకుశ దాడి అంతకంతకూ తీవ్రతరమవుతున్న ఈ పరిస్థితుల్లో రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, లౌకికవాదం, సోషలిజం వంటి ప్రాథమిక సూత్రాల పరిరక్షణకు ప్రజల విస్తృత ఐక్యత అనివార్యం. కాబట్టి, కార్పొరేట్ దోపిడీని అంతం చేసి రిపబ్లిక్ ఆఫ్ ఇండియా సెక్యులర్ డెమోక్రటిక్ క్యారెక్టర్‌ను కాపాడటానికి మద్దతు ఇవ్వాలని అన్ని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు అభ్యర్థిస్తున్నాం' అని ఆ ప్రకటన పేర్కొంది.

" ప్రజల నిజమైన జీవనోపాధి సమస్యలను తిరిగి జాతీయ ఎజెండాలోకి తీసుకురావాలి. విధ్వంసక-విభజన ఎజెండాను ప్రతిఘటించాలి. దానిని నిర్ణయాత్మకంగా ఓడించడానికి ప్రజలన పెద్దయెత్తున సమీకరించాలని ఆ ప్రకటన పేర్కొంది.

" స్వామినాథన్ సిఫారసులకనుగుణంగా అన్ని పంటలకు సి2 ప్లస్ 50 శాతం అన్న ఫార్ములా ప్రకారం కనీస మద్దతు ధర గ్యారంటీ చేస్తూ చట్టం తేవాలని, రైతులను కారుతో తొక్కించి చంపిన ఘటనతో ప్రమేయమున్న కేంద్ర మిగతా 7లో


16న దేశవ్యాప్త రోడ్డు రవాణా సమ్మె

కేంద్ర చట్టాలను నిరసిస్తూ కార్మిక సంఘాల పిలుపు 7

రియల్ ఎస్టేట్ అడ్డాగా అయోధ్య

1250 అడుగుల ప్లాట్ ప్రారంభ ధర 1.72 కోట్లు

అయోధ్య: అయోధ్యకు రాముడొచ్చాడో లేదో కానీ ఆ పేరుతో పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీలు మాత్రం గద్దల్లా వచ్చి వాలాయి. అయోధ్యలో ఇప్పుడు నడుస్తున్నది రియల్‌ఎస్టేట్ అధిపతులు, బ్రోకర్లు, డెవలపర్ల హవా. ఇప్పుడు ఏ పత్రిక తిరగేసినా తాటికాయంత అక్షరాలతో ఫుల్ పేజీ అడ్వర్టయిజ్‌మెంట్లు దర్శనమిస్తున్నాయి. వాటిలో అయోధ్య రాముడి పేరు మచ్చుకు కూడా కానరాదు. అంతా రియల్ ఎస్టేట్ మయం. తాజాగా ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచన్ బొమ్మతో ఫుల్ పేజీ యాడ్ ఒకటి వెలువడింది. పవిత్రమైన సరయు నది ఒడ్డున, అయోధ్య ఆలయానికి కూత వేటు దూరంలో, కొత్తగా ప్రారంభించిన విమానాశ్రయం నుంచి కేవలం 30 నిమిషాల్లో చేరుకునేలా, అయోధ్య నడిబొడ్డున ప్రపంచ స్థాయి విలాసవంతమైన హెూటళ్లు, రిసార్ట్‌లతో కూడిన కూడలిలో పెట్టుబడులు పెట్టడం ఉత్తమమని ఆ ప్రకటనలో అమితాబ్ చెబుతారు. వెయ్యికోట్ల డాలర్లతో ప్రపంచ పర్యాటక హాట్‌స్పాట్‌గా అయోధ్య మారుతోందని, అయోధ్యకు వచ్చే వారికి ఆతిథ్యం, ఆహారం, ప్రయాణం, రవాణా, వ్యాపారాలకు కేంద్రంగా ఉంటుందని ఆ అడ్వర్టయిజ్‌మెంట్ చెబుతుంది.



ముంబయి కేంద్రంగా పనిచేసే రియల్ ఎస్టేట్ డెవలపర్ 'హౌస్ ఆఫ్ అభినందన్ లోధా' వేసిన ఈ వెంచర్‌లో ఒక్కో ప్లాట్ (1250 చదరపు అడుగులు) ప్రారంభ ధర 1.72 కోట్లు . ఇటువంటివి 250 ప్లాట్లను ఆ కంపెనీ అమ్మకానికి పెట్టింది. అమెరికా, బ్రిటన్, ఆగ్నేయాసియా దేశాల్లోని ప్రవాస భారతీయుల కోసం అయోధ్యలో 51 ఎకరాలను రూ.1200 కోట్లకు కొనుగోలు చేసింది. అయోధ్య గ్లోబల్ కల్చరల్ కేపిటల్‌గా అవతరిస్తోందని, అయోధ్యలో ప్రవేశానికి ఒకే ఒక ముఖ ద్వారం హౌస్ ఆఫ్ లోధా అని ఆర్భాటంగా ఆ ప్రకటనలో పేర్కొంది.

'అయోధ్య నడిబొడ్డున ఏర్పాటు చేస్తున్న ఈ వెంచర్‌లో నేనూ ఒక ప్లాట్ కొనుక్కున్నాను. మరి మీరూ!' అంటూ అమితాబ్ తనదైన శైలిలో ఆ ప్రకటనలో పేర్కొంటారు. అమితాబ్ మాదిరిగానే కార్పొరేట్ దిగ్గజం ముఖేష్ అంబానీ కూడా అయోధ్యలో ప్లాట్ కొనుగోలు చేసినట్లు వార్తలొచ్చాయి. అయోధ్యలో నేడు ఆధ్యాత్మికత కన్నా రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. అయోధ్యలో ఆలయ నిర్మాణానికి అనుకూలంగా 2019లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తరువాత ఆస్తుల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. అయోధ్య జిల్లా స్టాంప్ రిజిస్ట్రేషన్ విభాగం వద్ద ఉన్న డేటా ప్రకారం 2017-2022 మధ్య ఆస్తి రిజిస్ట్రేషన్లు 120 శాతం పెరిగాయి. ఇదీ అయోధ్య అసలు కథ!

అసైన్డ్ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి

- సిసిఎల్ఎ అదనపు కమిషనర్‌కు వ్యకాస వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూ సేకరణలో పట్టా భూములతో సమానంగా అసైన్డ్ భూములకు నష్టపరిహారం ఇవ్వలేమని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సిసిఎల్ఎ అదనపు కమిషనరు ఇంతియాజ్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి దడాల సుబ్బారావు, వి శివాగరాణి, వి వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు ముజఫర్ అహ్మద్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల పేరుతో అసైన్డ్ భూములును సేకరించిన సందర్భంలో మార్కెట్ రేటుకు నాలుగు రెట్లు అదనంగా లబ్ధిదారులకు పరిహారం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం 2013 భూ సేకరణ పునరావాసం చట్టం తీసుకొచ్చిందన్నారు. భూ సేకరణలో పట్టా భూములతో సమానంగా నష్టరిహారం ఇవ్వలేమంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌తో ప్రభుత్వ భూములు పొందిన దళిత, గిరిజన, బలహీనవర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



కాకినాడలో సత్యవతి కుటుంబానికి సాయం అందిస్తున్న భువనేశ్వరి

కార్యకర్తలకు అండగా టిడిపి

- నారా భువనేశ్వరి

తూర్పు గోదావరి జిల్లా యంత్రాంగం: టిడిపి కార్యకర్తలకు కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని టిడిపి అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి భరోసా ఇచ్చారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మనస్తాపంతో మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను బుధవారం ఆమె పరామర్శిచి ఆర్థిక సాయం అందించారు. పార్టీ కార్యకర్తలు తమ కుటుంబ సభ్యులేనని, వారికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిజం గెలవాలి మూడ్రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు జగ్గంపేట, పెద్దాపురం, తుని రూరల్, కాకినాడ సిటీ నియోజకవర్గాల్లో ఆమె పర్యటించారు. జగ్గంపేటలో పడాల వీరబాబు కుటుంబాన్ని, పెద్దాపురం మండలం కాంద్రకోటలో బుద్దాల సుబ్బారావు కుటుంబాన్ని, తుని రూరల్ తేటగుంటలో ఈసరపు నూకరాజు కుటుంబాన్ని, కాకినాడ సిటీలో చిక్కాల సత్యవతి కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. ఆ కుటుంబాలకు రూ. మూడు లక్షల చొప్పున సాయం అందజేశారు.

రాజకీయ పార్టీలకు గుర్తులు కేటాయింపు

- కేంద్ర ఎన్నికల సంఘం

అమరావతి బ్యూరో : 2024లో జరుగునున్న సాధారణ శాసనసభ ఎన్నికలకు సంబంధించి రాజకీయపార్టీలకుకేంద్ర ఎన్నికల సంఘం బుధవారం గుర్తులు (సింబల్స్)ను కేటాయించింది. నీతి నిజాయితీ పార్టీకి కొబ్బరితోట, ప్రజా ఏకతాపార్టీకి ప్రెజర్ కుక్కర్, యుగ తులసీ పార్టీకి రోడ్డు రోలర్, జనసేనపార్టీకి గాజు గ్లాసు గుర్తును కేటాయించింది. రీపార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియాకు విద్యుత్తు స్థంభం, సూర్యరేవతి ప్రజాపార్టీకి ల్యాప్ టాప్ గుర్తులను కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించింది.

వైసిపి దొంగ ఓట్ల కుట్ర : పురందేశ్వరి

అమరావతి బ్యూరో : వైసిపి వైనాట్ 175 నినాదం వెనుక దొంగ ఓట్ల ద్వారా లబ్ధిపొందాలనే కుట్ర ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. అధికార పార్టీ అభ్యర్థుల స్థానాలు మారుస్తున్నారని, అదే సమయంలో వారి మద్దతు ఓటర్ల జాబితాలు కూడా మారుస్తున్నారని అన్నారు. వేల కొద్ది కొత్త ఓట్లను వేర్వేరు నియోజకవర్గాల్లో నమోదు చేస్తున్నారన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం గాంవ్ ఛలో అభియాన్ వర్క్‌షాపును ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పొత్తుల విషయం అధిష్టానం చూసుకుంటుందన్నారు. రాష్ట్రంలో వలంటీర్ల ద్వారా వృద్ధుల ఓట్లు వేయిస్తే తాము అభ్యంతరం తెలుపుతామన్నారు.

'డ్వాక్రా' వడ్డీ దోచుకుంటున్న ప్రభుత్వం

- జిఓ 2 రద్దు చేయాలి
- వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

డ్వాక్రా మహిళలు కష్టపడి చేస్తున్న పొదుపు వడ్డీని రాష్ట్ర ప్రభుత్వందోచుకుంటోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంఒ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. సీతారాంతో కలిసి మాట్లాడిన ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణం ప్రభుత్వమే ఇయ్యవచ్చని చెప్పారు. డ్వాక్రా సంఘాల్లో కోటిమంది మహిళలు ఉంటే 79 లక్షల మందికి ఆసరా ఇచ్చారని తెలిపారు. వారి డబ్బులు రూ.18 వేల కోట్లు డిపాజిట్ల రూపంలో బ్యాంకుల్లో ఉన్నాయని, వాటికి రూపాయి చొప్పున వడ్డీ ఇచ్చినా రూ.3 వేల కోట్లు వస్తాయని, ప్రభుత్వం రద్దుచేసిన వడ్డీ రూ.1300 కోట్లని చెప్పారు. ఈ లెక్కలు పరిశీలిస్తే డ్వాక్రా మహిళలే ప్రభుత్వానికి వడ్డీ ఇస్తున్నట్లు అర్థమవుతుందని చెప్పారు. దానిలో కొంతభాగాన్ని మహిళలకు ఇచ్చి దాన్నే ఆసరాగా చెప్పడం మహిళలను మోసం చేయడమేనని అన్నారు. అసలు ప్రభుత్వం వడ్డీలేని రుణాలే ఇవ్వొచ్చని, అలా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. దీనికితోడు బ్యాంకర్లు కూడా ప్రాసెస్ పేరుతో వందల కోట్లు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై సిఎం నోరెత్తడం లేదని తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. జిఓ నెంబరు 2ను వెంటనే రద్దు చేయాలని కోరారు. అది అలాగే ఉంచితే రాబోయే రోజుల్లో పోరాడే ప్రజల మెడపై కత్తిలా ఎదురవుతుందని తెలిపారు.

ఠాకూర్, అంబేద్కర్ పేరుతో పేదల అణచివేత

భారతరత్న బిరుదు ఇవ్వడం ద్వారా కర్పూరీ ఠాకూర్‌ను అడ్డుపెట్టుకుని దేశంలో బిసిలను, రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి దళితులు, మైనార్టీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేస్తున్నాయని పేర్కొన్నారు. సోషలిస్టయిన కర్పూరిఠాకూర్ బీహార్లో మద్య నిషేధాన్ని అమలు చేస్తే ఆయనకు భారతరత్న బిరుదు ఇచ్చినరోజే బిజెపి పాలిత గుజరాత్‌లో మద్య నిషేధాన్ని ఎత్తేశారని



మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

తెలిపారు. సోషలిస్టు భావాలు కలిగిన ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చి కులగణన చేయకుండా సామాజిక న్యాయానికి గండి కొడుతున్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టి ఆయన ఆశయాలు అయిన కుల నిర్మూలన, రిజర్వేషన్లను తుంగలో తొక్కుతున్నారని, ఇదేనా వారికి అర్పించే నివాళని ప్రశ్నించారు.

బిసి యువతను మోసం చేస్తున్న కేంద్రం

బిసిల కోసం పెట్టిన విశ్వకర్మ కౌశల్ యోజన పథకం కింద 2.50 లక్షల దరఖాస్తులు మాత్రమే తీసుకుంటామని షరతు పెట్టారని, వాస్తవంగా దీనికి అర్హులైన బిసి యువత 50 లక్షల మంది ఉన్నారని వివరించారు. పెట్టుకున్నవారిలో అర్హులకు మూడు లక్షల రుణం ఇచ్చి ఐదుశాతం వడ్డీ కట్టించుకుంటున్నారని పేర్కొన్నారు. అంటే అధిక వడ్డీ వసూలు చేసి బిసిలను నిలువునా మోసం చేయడానికి మోడీ, బిజెపి ప్రయత్నిస్తున్నాయని అన్నారు. సోషల్ ఇంజనీరింగ్ పేరుతో చేస్తున్న ఇటువంటి కుట్రలను శ్రీనివాసరావు ఖండించారు.

ఉద్యమాలను అణచే రాజకీయ సాధనంగా పోలీసులు

ఆసరా పేరుతో సిఎం అనంతపురం వెళ్లిన సమయంలో సిపిఎం, సిఐటియు, అంగన్‌వాడీలు, ఇతర వామపక్ష నాయకులను అరెస్టు చేశారని అన్నారు. పోలీసులు ప్రతిపక్ష పార్టీలను, ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు రాజకీయ సాధనంగా మారిపోతున్నారని విమర్శించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలను సభలు పెట్టుకోనీయడం లేదని, అధికారపక్షం ఎక్కడ ఎప్పుడు ఎలా కావాలంటే అలా పెట్టుకునేందుకు అనుమతిస్తున్నారని తెలిపారు. రెండు నెలల్లో ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఇలా ఏకపక్ష నిర్ణ యాలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని ఈ రెండు నెలలు యంత్రాంగాన్ని ఎన్నికల కమిషన్ చేతుల్లోకి తీసుకోవాలని అన్నారు.

ప్రజలు బాధల్లో ఉన్నారు

సిఎం స్టార్ క్యాంపెయినర్లు ప్రజలేనని చెబుతున్నారని, కానీ వారే స్టోరీ రివోల్టర్స్ అవుతున్నారని, ప్రభుత్వం మోపుతున్న భారాలనూ వ్యతిరేకించడంలోనూ ప్రజలే స్టార్లని అన్నారు. ఇదే అంశంపై వారు రాష్ట్రంలో ప్రచారం చేస్తారని, ఆ విషయాన్ని కూడా సిఎం మర్చిపోకూడదని పేర్కొన్నారు.

స్పీకర్‌కు ప్రజాస్వామ్య విలువలు లేవు

ఎమ్మెల్యే గంటా రాజీనామాను ఆమోదించడంలో స్పీకర్ కనీస విలువలు పాటించలేదని, రాజకీయ ఆలోచనల ప్రకారం ఆమోదించారని, ఈ విషయంలో ఆయన ప్రజాస్వామ్య విలువలు పాటించలేదని మండిపడ్డారు. రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో గెలవలేమనే పేరుతో మూడేళ్ల క్రితం చేసిన రాజీనామాను సభ్యుడి అభిప్రాయం కోరకుండా ఇప్పుడు ఆమోదించారని అన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఒత్తిడి చేసినా చట్టం ప్రకారం వ్యవహరించాలని, సభ్యుడి అభిప్రాయం తీసుకోవాలని, స్పీకర్ అనుసరించింది అనైతిక పద్ధతని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని పేర్కొన్నారు.

సెక్యులర్ పార్టీలతో సంప్రదింపులు

బిజెపికి రాష్ట్రంలో చోటు లేకుండా చేయడం సిపిఎం ప్రధాన కర్తవ్యమని శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన బిజెపికి చోటు ఇస్తున్నాయని, వారితో కలిసే ప్రసక్తే లేదని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా కలిసివచ్చే సెక్యులర్ పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఇండియా వేదిక లేదని, కేంద్రంలో మాత్రమే ఉందని, వేదికలో లేని అనేక పార్టీలు రాష్ట్రంలో ఉన్నాయని వివరించారు. సిపిఐతో సంప్రదింపులు చేస్తున్నామని, బిజెపి వ్యతిరేక లౌకిక పార్టీలతో సంప్రదింపులు చేస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఎవరికీ లేని ఆంక్షలు ఉపాధ్యాయులపైనే ఎందుకు?

- ఇది ఏ ప్రజాస్వామ్యం : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎవరికీ లేని సెక్షన్-30 ఆంక్షలు ఉపాధ్యాయులకు, ప్రత్యేకించి తమ సంఘానికి ఎందుకు ఉంటుందో చెప్పాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ప్రజాస్వామ్య పద్ధతిలో, నిబంధనలకు లోబడి చేసుకునే పోరాటాలకు ఎటువంటి అనుమతి ఇవ్వకుంటే తమ సమస్యలు ఎలా పరిష్కరామవుతాయో ప్రభుత్వం చెప్పాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్‌-ఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నాలకు పిలుపునిస్తే ముందుగా అనుమతినిచ్చి తరువాత రద్దు చేయడం, ప్రత్యేకించి తమ సంఘం కార్యాచరణకు అనుమతినివ్వకపోవడం ఎలాంటి ప్రజాస్వామ్యమో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, పిఎఫ్ తదితర సమస్యల పరిష్కారానికి రెండు నెలలుగా స్థానిక, జిల్లా స్థాయిలో పోరాటాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 25న రాష్ట్రస్థాయి ధర్నాకు పిలుపు ఇచ్చామని వివరించారు. గతంలో డిసెంబరు 30న రాష్ట్ర ధర్నాకు పిలుపునిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పి ప్రభుత్వం కార్యక్రమాన్ని వాయిదా వేయించిందని తెలిపారు. నేటికీ ఒక్క సమస్య పరిష్కారం కాని పరిస్థితిలో అనివార్యంగా మరోమారు రాష్ట్ర ధర్నాకు పిలుపునిచ్చామని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సత్ప్రవర్తులైన ఖైదీలను విడుదల చేయాలి

- సిఎంకు రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని వివిధ జైళ్లలో పదేళ్లకు పైగా శిక్ష పూర్తి చేసుకున్న ఖైదీలను గుర్తించి, అందులోని సత్ప్రవర్తన కలిగిన వారిని రిపబ్లిక్ డే సందర్భంగా విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వం కొత్తగా విధించిన నిబంధనలతో చాలా మంది జైళ్లలో మగ్గిపోతున్నారని తెలిపారు.

ఐదేళ్ల శిక్ష పూర్తి చేసుకున్న మహిళా ఖైదీలను, పదేళ్ల శిక్ష పూర్తి చేసుకున్న పురుష ఖైదీల విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులను, ఖైదీల ఆరోగ్య సమస్యలను దృష్టిలో వుంచుకుని తక్షణం దీర్ఘకాలికంగా జైలులో వున్నవారి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల ముందస్తు అరెస్టు

- 'చలో విజయవాడ' వెళ్లనీయకుండా పోలీసుల నిర్బంధం

ప్రజాశక్తి- యంత్రాంగం

'చలో విజయవాడ'కు వెళ్లనీయకుండా విజయనగరం జిల్లాలో యుటిఎఫ్ నాయకులను, ఉపాధ్యాయులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పలు జిల్లాల్లో ఉపాధ్యాయులకు ముందస్తు నోటీసులు ఇచ్చారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు, పిఎఫ్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నాకు యుటిఎఫ్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లాలో పలువురు యుటిఎఫ్ నాయకులను, ఉపాధ్యాయులను పాఠశాలల్లోకి వెళ్లి అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. విద్యార్థులకు పాఠాలు భోదించాల్సి ఉందని, పాఠశాలలోకి వచ్చి అరెస్టు చేయాలని చూడడం సరికాదని వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో, పోలీసులు బయటకు వచ్చేసి పాఠశాల బయట కాపు కాశారు. పాఠశాల ముగిసిన అనంతరం బయట వచ్చిన యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరిని రామభద్రపురంలోనూ, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్‌ను ముచ్చర్లవలసలోనూ, ఉపాధ్యాయులు టి.స్వామినాయుడు, పి.సత్యనారాయణలను గొల్లపల్లి, పాత బొబ్బిలిలోనూ అరెస్టు చేసి బొబ్బిలి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు కర్నూలు కలెక్టరేట్ వద్ద బుధవారం సాయంత్రం ధర్నా చేశారు. అక్కడికి పోలీసులు వచ్చి విజయవాడ ధర్నాకు వెళ్లవద్దంటూ యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటిల్‌తో పాటు పలువురి నాయకులకు నోటీసులు ఇచ్చారు. అనంతపురంలో పలువురు యుటిఎఫ్ నాయకులకు, ఉపాధ్యాయులకు పోలీసులు మంగళవారమే ముందస్తు నోటీసు అందజేసి విజయవాడ వెళితే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ పోలీసులు పోలీసులు పలువురికి నోటీసులు ఇచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తికి అత్తిలిలో, జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజుకు భీమవరంలో, ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రానికి పాలకొల్లులో పోలీసులు 41 ఎ నోటీసులు



బొబ్బిలి యుటిఎఫ్ : విజయనగరం జిల్లా బొబ్బిలి స్టేషన్‌లో పోలీసుల నిర్బంధంలో ఉన్న యుటిఎఫ్ నాయకులు

అందజేశారు. మరో 50 మంది ఉపాధ్యాయులకు, యుటిఎఫ్ నాయకులకు ముందస్తు నోటీసులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ పోలీసులు పలువురికి నోటీసులు ఇచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తికి అత్తిలిలో, జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజుకు భీమవరంలో, ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రానికి పాలకొల్లులో 41 ఎ నోటీసులు అందజేశారు. మరో 50 మంది ఉపాధ్యాయులకు, యుటిఎఫ్ నాయకులకు ముందస్తు నోటీసులు జారీ చేశారు.

విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేయాలి

ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని విఆర్ఎలకు తెలంగాణ తరహాలో పే స్కేల్‌ను, ఉద్యోగోన్నతులను అమలు చేయాలని ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం కోరింది. ఈ మేరకు బుధవారం సంఘం రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, నాయకులు అహ్మద్ సిసిఎల్ఎ అదనపు కమిషనరు ఇంతియాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు విఆర్ఎలకు టిఎ, డిఎలు అమలు చేయాలని కోరారు. అలాగే విఆర్ఎల వేతనాల పెంపు సమస్యను పరిష్కరించాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- 2 నుంచి రాష్ట్ర వ్యాప్త ఆందోళన
- విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ డిమాండ్ చేసింది. లేదంటే ఫిబ్రవరి రెండు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని కమిటీ ఛైర్మన్ పి సుదర్శన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ వి సుబ్బిరెడ్డి హెచ్చరించారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బుధవారం వారు మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తానని ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు దీనిని నెరవేర్చలేదని అన్నారు. రానున్న ఎన్నికల్లోపు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. విద్యుత్ రంగంలో థర్డ్ పార్టీ విధానం తొలగించి విద్యుత్ యాజమాన్యాలే కాంట్రాక్టు కార్మికులకు నేరుగా వేతనాలు ఇవ్వాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ డిఎలు, పిఆర్‌సి బకాయిలు ఒకే దఫాలో చెల్లించాలని కోరారు. 1999 తర్వాత నియామకమైన వారికి పెన్షన్ సౌకర్యం, వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సంస్థల్లో ఖాళీగా ఉన్న వేల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జెన్‌కోలో పాతికేళ్ల నుంచి ఎటువంటి ప్రమోషన్‌కూ నోచుకోని జెపిఎలకు పిఎలుగా వన్‌టైం సెటిల్‌మెంటు కింద ప్రమోషన్ కల్పించాలని తెలిపారు. షిఫ్ట్ ఆపరేటర్లలో వేతనాల వ్యత్యాసాన్ని సవరించాలని, పీస్ రేటు వర్కర్లు అయిన హమాలీలకు, మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. కారుణ్య నియామకాల కింద సచివాలయ ఉద్యోగాలు కాకుండా వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్ అమలు చేయాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులు పనిచేసే సబ్‌స్టేషన్లను ప్రైవేటుకు అప్పగించొద్దని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై తాము కొన్ని నెలలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం గానీ, యాజమాన్యాలు గానీ స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి రెండున జిల్లాల్లో కార్మిక కమిషనర్లకు, ఐదున జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. 8న సర్కిల్, జనరేటింగ్ స్టేషన్ల వద్ద ధర్నాలు, 12న విజయవాడలో రిలే దీక్షలు చేపడతామని వెల్లడించారు. ఈ ఆందోళనల్లో కార్మికులు, ఉద్యోగులు పెద్దయెత్తున మద్దతు పలకాలని కోరారు. యునైటెడ్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఏజెన్సీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ ఏజెన్సీ అలవెన్స్ వర్తింపజేయాలని కోరారు. స్మార్ట్ మీటర్ల వల్ల పీస్‌రేట్ వర్కర్లు, హమాలీలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీరికి ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కమిటీ నాయకులు వెంకటేశ్వరరావు, రసూల్, మోహన్‌రావు పాల్గొన్నారు.

వైసిపి అద్దంకి మాజీ ఇన్‌ఛార్జి క్వారీలో తనిఖీ

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

వైసిపి అద్దంకి నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్యకు సంబంధించిన గ్రానైట్ క్వారీలో మైనింగ్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. క్వారీకి అనుమతి ఉందా? లేదా? అనుమతి ఉంటే అనుమతులకు మించి రాయి తీస్తున్నారా? లేక చట్టాన్ని ఉల్లంఘించి అనుమతికి మించి రాళ్లు తీస్తున్నారా? అనే విషయంపై అధికారులు ఆరా తీశారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. కక్ష సాధింపు చర్యలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు కృష్ణచైతన్య అనుచరులు విమర్శించారు. రెండు నెలల క్రితం వైసిపి ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి కృష్ణ చైతన్యను పార్టీ అధిష్టానం తప్పించింది.

ఆయన స్థానంలో పానెం హనీమిరెడ్డిని నియమించింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలను ఎవరికి వారే పోటా పోటీగా నిర్వహించారు. ఈ క్రమంలో ఇరువురునీ సిఎంఒ కార్యాలయానికి పిలిపించారు. కృష్ణ చైతన్య పార్టీ మారుతున్నట్లు గత రెండు, మూడు రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో బల్లికురవ మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో ఉన్న కృష్ణచైతన్యకు సంబంధించిన క్వారీలో మైనింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారని ఆయన అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దళిత ఉద్యోగులపై దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభాగంలో శానిటరి ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న ధనరాజు, రజినీదేవి అనే దళిత దంపతులపై దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజమండ్రి నగరంలో ఈ నెల 21న మోరంపూడి సమీపంలో చెత్తను రోడ్డుపై వున్న డివైడర్‌లో వేయొద్దన్నందుకు విధి నిర్వహణలో వున్న దంపతులిద్దరిపై వెంకన్నబాబు దాడి చేసి కొట్టారని తెలిపారు. చెత్తను ఫొటో తీస్తుండగా తన చేతిలో వున్న బకెట్‌తో ధనరాజుపై దాడికి పాలడటంతోపాటు అడ్డుచెప్పిన రజినీదేవిని జుట్టుపట్టుకుని కొట్టారన్నారు. విధి నిర్వహణలో వున్న దళిత దంపతులపై దాడికి పాల్పడ్డ వెంకన్నబాబును తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గాయపడ్డ ధనరాజ్‌కు మెరుగైన వైద్య చికిత్సను అందించాలని కోరారు.

ఉద్యోగుల పక్షపాతి జగన్

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతి అని, ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉద్యోగులు కృషి చేయాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కోరారు. విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి, ఎస్‌టి గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2024 డైరీని సజ్జల బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అణగారిన తరగతులను పైకి తీసుకొచ్చే ప్రక్రియలో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని కోరారు. గత ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల కోసం ఖర్చు చేసిందేమీ లేదన్నారు. సచివాలయ ఉద్యోగాలు 80 శాతం బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకే దక్కాయన్నారు. ఎన్నికలు రాబోతున్నాయని, అందరి భవిష్యత్తులు మారాలంటే ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. విజయవాడలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం రూపుదిద్దుకుందన్నారు.

ఆథరైజేషన్ డీలర్స్ ద్వారా కార్డుదారులకు సరుకులు

- రేషన్ డీలర్ల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని డీలర్స్‌కు పిడిఎస్ కంట్రోల్ ఆర్డర్ ఆహార భద్రతా చట్టం ప్రకారం ఆథరైజేషన్ పొందిన డీలర్స్ ద్వారా మాత్రమే కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలని రాష్ట్ర డీలర్ల సంఘం అధ్యక్షులు దివి లీలా మాధవరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి రేషన్ డీలర్ల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సమావేశం పలు తీర్మానాలు చేసింది. ఎమ్‌డియుల ద్వారా పంపిణీ చట్ట విరుద్ధమని, దానిని ప్రభుత్వం పున:పరిశీలించాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన జిఓ నెంబరు 5 ఉత్తర్వుల్లో పేర్కొన్న విధంగా మరణించిన డీలర్ల మట్టి ఖర్చులు మంజూరు, సంక్షేమ నిధి ఏర్పాటు, హెల్త్ కార్డులు జారీ, బీమా సౌకర్యం వంటివి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాని సమావేశం డిమాండ్ చేసింది. జిఓ నెంబరు 20 ద్వారా రేషన్ డీలర్స్‌ను బ్యాంకు కరస్పాండెంట్లుగా నియమించే ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని సమావేశం తీర్మానించింది.



అభివాదం చేస్తున్న నేతలు

శ్రీనివాస్‌కు న్యాయం చేయాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఐదేళ్ల క్రితం విశాఖపట్నంలో సిఎం జగన్‌పై జరిగిన దాడి ఘటనలో జనపల్లి శ్రీనివాస్ అన్యాయంగా ఐదేళ్లుగా జైలుశిక్ష అనుభవిస్తున్నారని, తక్షణమే న్యాయమూర్తులు స్పందించి న్యాయం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. శ్రీనివాస్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సమతా సైనిక్ దళ్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యాన విజయవాడలోని దాసరి భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, టిడిపి జాతీయ కార్యదర్శి వర్ల రామయ్య, జనసేన రాష్ట్ర నాయకులు పోతిన మహేష్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, మైనార్టీ నాయకులు ఫారుక్ షుబ్లీ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో గొడ్డలితో నరికిన వారు, దళితున్ని హత్యచేసి కుటుంబ సభ్యులకు డోర్ డెలివరీ చేసిన వారు, 13 సిబిఐ కేసులు, మూడు ఇడి కేసులున్న వారు బెయిల్‌పై దర్జాగా బయట తిరుగుతుంటే తమ రాజకీయ అవసరాల కోసం కోడి కత్తితో దాడి చేయించుకున్న ఘటనలో దళిత బాధితుడు ఐదేళ్లుగా జైలులో మగ్గిపోవడం సరైంది కాదన్నారు.

దళితుడు కాబట్టే శ్రీనివాస్‌కు న్యాయం జరగటం లేదని తెలిపారు. జనపల్లి శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు చేయడంతోపాటు తగిన న్యాయం చేయకుంటే ప్రజా ఉద్యమం తప్పదని అన్నారు. జగన్ దగ్గర డబ్బు, అధికారం వున్న కారణంగానే శ్రీనివాస్‌కు బెయిల్ రావడం లేదన్నారు. తక్షణం శ్రీనివాస్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిల్లి సురేంద్రబాబు, వరప్రసాద్, చింతా వెంకటేశ్వర్లు, శ్వేత, శ్రీనివాస్ తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు తదితరులు మాట్లాడారు. జనపల్లి శ్రీనివాస్‌కు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని అంచెలంచెలుగా ఉధృతం చేయాలని సమావేశం తీర్మానించింది.

ఆర్‌టిసికి డ్రైవర్లే ప్రగతి చక్రాలు

- రవాణాశాఖ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి రథచక్రాలు ప్రగతి పథంలో దూసుకెళ్లడంలో డ్రైవర్ల పాత్ర అద్వితీయమైనదని రాష్ట్ర రవాణాశాఖ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న తెలిపారు. బుధవారం డ్రైవర్స్ డే సందర్భంగా ఆయన విజయవాడలోని ఆర్‌టిసి డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో డ్రైవర్లు అభినందనీయంగా పనిచేస్తున్నారన్నారు. డ్రైవర్లు కూడా విధి నిర్వహణలో అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతియేటా జనవరి 15 నుంచి ఫిబ్రవరి వరకు రోడ్డు భద్రతా మాసోత్సవం నేపథ్యంలో ప్రతియేటా జనవరి 24న డ్రైవర్స్ డేను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆర్‌టిసిలోనే కాక అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న డ్రైవర్లను ఈ డ్రైవర్స్ డే సందర్భంగా భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. డ్రైవర్లు శిక్షణ తరగతులకు హాజరవుతూ రవాణా రంగంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలన్నారు.

పవన్‌తో కొణతాల భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌తో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ మంగళగిరి పార్టీ కార్యాలయంలో బుధవారం భేటీ అయ్యారు. ఇటీవల రామకృష్ణ జనసేనలో చేరబోతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భేటీ అయ్యారు. త్వరలో అధికారికంగా జనసేనలో చేరనున్నారు.

జానీ మాస్టర్, పృథ్వీరాజ్ జనసేనలో చేరిక

ఎస్‌విబిసి మాజీ ఛైర్మన్, సినీ నటుడు పృథ్వీరాజ్, డ్యాన్స్ మాస్టర్ జానీ మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో జనసేన గెలుపు కోసం విస్తృత ప్రచారం చేస్తామని తెలిపారు.

బిజెపితో వైసిపి, టిడిపి కుమ్మక్కు

- పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్.షర్మిల

ప్రజాశక్తి- కలెక్టరేట్/ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రంలో కుమ్మక్కు రాజకీయాలు నడుస్తున్నాయని, బిజెపితో టిడిపి, వైసిపి కుమ్మక్కయ్యాయని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైఎస్.షర్మిల ఆరోపించారు. విశాఖలోని దసపల్లా హోటల్లో కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రంగా ద్రోహం చేసిన బిజెపిని, దానితో కుమ్మక్కు అయిన పార్టీలను చిత్తుగా ఓడించాలని కోరారు. ప్రత్యేక హోదా కోసం జగనన్న ఒక్క రోజు కూడా ఉద్యమం చేసింది లేదన్నారు. ఉత్తరాంధ్రను వైసిపి, టిడిపి మోసం చేశాయని విమర్శించారు. గంగవరం పోర్టును అదానీకి అమ్మేశారని తెలిపారు.

పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న 10 శాతం వాటాను నిబంధనలకు విరుద్ధంగా రూ.600 కోట్లకు జగనన్న అమ్మేసి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. 30 ఏళ్ల లీజు తర్వాత గంగవరం పోర్టు ప్రభుత్వ పరం కావాల్సి ఉందని, ఇప్పటికే లీజు కాలం 15 ఏళ్లు గడిచిందన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఒక కుట్ర అన్నారు. ఇందిరమ్మ హయాంలో ఏర్పడిన విశాఖ స్టీల్‌ను అమ్మే ప్రయత్నం చేయడం దుర్మార్గమని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 3 మిలియన్ టన్నుల ఉత్పత్తిని 7 మిలియన్ టన్నుల ఉత్పత్తికి పెంచారని తెలిపారు. ఇప్పుడు నష్టాల సాకుగా చూపి, ప్రయివేటీకరణ చేయాలని కేంద్రం చూస్తోందని విమర్శించారు. విశాఖకు రైల్వే జోన్ ఇచ్చినా ఇంకా అమలులోకి రాలేదని, మెట్రో రైల్ ప్రాజెక్టు పత్తా లేదని తెలిపారు. బిజెపితో టిడిపి, వైసిపి దోస్తీని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైసిపి మాజీ నాయకులు కొయ్య ప్రసాద్‌రెడ్డి, క్రికెటర్ కమలాకర్, మహిళా నేత బట్టా స్వర్ణ, మాజీ కార్పొరేటర్లు తాడి మనోహర్, అప్పలరాజు, టీవీ సీరియల్ నటి సరస్వతి, ఆప్ మాజీ నాయకులు కాశీభట్ల బ్రహ్మస్వరూప్, బిఆర్ఎస్ నాయకుడు జెటి.రామారావు తదితరులు షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

అధికారంలోకొస్తే స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తామని షర్మిల హామీ ఇచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షా శిబిరాన్ని వైఎస్.షర్మిల సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా చూస్తామని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపైనే మొదటి సంతకం చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో విశాఖ ఉక్కు అంశాన్ని చేర్చుతామని చెప్పారు. గాజువాకలోని జింక్ ప్లాంట్‌ను వేదాంతకు అప్పగించారని, దాన్ని మూసేసి ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను అదానీ, అంబానీలాంటి పెట్టుబడుదారులకు అమ్మి ప్రజాస్వామ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఖూనీ చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యసభ ఎన్నికల భయంతోనే రాజీనామాకు ఆమోదం

- మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)



విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మూడేళ్ల క్రితం ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేస్తే దానిని ఇప్పుడు స్పీకర్ ఆమోదించడమేమిటని టిడిపి మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు. విశాఖలోని టిడిపి కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పవిత్రమైన ఆశయం కోసం 2021 ఫిబ్రవరి 12న ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానన్నారు. స్వయంగా స్పీకర్‌ను కలిసి రాజీనామా లేఖను సమర్పించానని తెలిపారు. ఆముదాలవలస వెళ్లి స్పీకర్ గృహంలో కలిసి రాజీనామా ఆమోదించాలని కోరానని చెప్పారు. ఎన్నిసార్లు కలిసినా రాజీనామాను ఆమోదించలేదని తెలిపారు. నా రాజీనామా లేఖను కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచారన్నారు. ఇప్పుడు కుట్ర కోణంతో ఆమోదించారని ఆరోపించారు. రాజీనామా ఆమోదించే ముందు తనను స్పీకర్ సంప్రదించాల్సి ఉన్నా ఆలా చేయలేదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమంపై సిఎం జగన్ కన్నెత్తి చూడలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన కేసుల కోసం రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టు పెట్టారన్నారు. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో తన రాజీనామాను నిబంధనలకు విరుద్ధంగా ఆమోదించారని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పార్లమెంట్ సమావేశాలలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఎంపిలు ప్లకార్డులు ప్రదర్శించగలరా? అని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - పరిగి (శ్రీసత్యసాయి జిల్లా)

శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలోని బీచిగానిపల్లి పంచాయతీ పరిధి పాత్రగానిపల్లిలో అప్పుల భారంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత్రగానిపల్లికి చెందిన రైతు ఈశ్వరప్ప (50) పంటసాగుకు, కుటుంబ పోషణకు, కూతురు పెళ్లికి అప్పులు చేశారు. వడ్డీలు పెరిగి రూ. 20 లక్షలు వరకూ అయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో అన్న మనోవేదనకు తరచూ గురి అయ్యేవారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయిన ఈశ్వరప్ప రాత్రైనా ఇంటికి రాలేదు. బుధవారం ఉదయం పొలాల్లో వేప చెట్టుకు ఉరివేసుకుని కన్పించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

ఉత్తర సర్కారుల బాప్టిస్టు సంఘముల మహాసభ-2024
C.B.C.N.C. సొసైటీ - రిజిష్టర్ నెం.16/48-49

ఆహ్వానం

ప్రభువు నందు ప్రియమైన ఉత్తర సర్కారుల బాప్టిస్టు సంఘముల సభ్యులు, సంఘ కాపరులకు, యౌవనులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

మన ప్రభువైన యేసుక్రీస్తు కృపనుబట్టి మహా సభలను జరిపించుటకు ప్రోగ్రాం మరియు ఎలక్షన్ కమిటి తీర్మానం ప్రకారం మహాసభలను 2024 జనవరి, 26, 27, 28 తేదీలలో విజయవాడ నందు జరుగునని తెలియజేయు చున్నాము.

C.B.C.N.C. నిబంధనలననుసరించి ప్రార్ధనా పూర్వకముగా పంపగోరు చున్నాము. ప్రతి రాయబారి సంఘములు నిర్ణీత రుసుమును చెల్లించి వారి పేర్లు నమోదు చేసుకొనవలయును.

ఇట్లు
రెవ. M.జాన్ శుభోదన్
కన్వీనర్, ప్రోగ్రాం మరియు ఎన్నికల కమిటీ
C.B.C.N.C.

వ్యవసాయానికి రూ.15 వేల కోట్లు !

- ఆర్థిక శాఖకు వ్యవసాయ శాఖ బడ్జెట్ ప్రతిపాదనలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వ్యవసాయ రంగానికి అంచనాగా దాదాపు రూ.15 వేల కోట్లు కావాల్సివుంటుందని ఆ శాఖ అధికారులకు ఆర్థికశాఖకు బడ్జెట్ ప్రతిపాదనలు పంపారు. ప్రధానంగా వైఎస్ఆర్ రైతు భరోసా కోసం తాజా బడ్జెట్‌లో రూ.7,305 కోట్లు కావాల్సి ఉంటుందని ప్రతిపాదించారు. కేంద్రం నుంచి వచ్చే అంచనా నిధులను కలిపి ఈ ప్రతిపాదనలు నివేదించారు. రైతు భరోసా కింద 55 లక్షల కుటుంబాలకు మేలు కలుగుతుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో 52 లక్షల మంది భూ యజమానులు, లక్ష మంది ఆర్ఓఎఫ్ఆర్ రైతులు ఉంటారని, మరో రెండు లక్షల మంది మాత్రమే కౌలు రైతులు ఉంటారని అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఉచిత పంటల బీమా పథకానికి రూ.2,045 కోట్లు కావాలని ప్రతిపాదించారు. వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకానికి మరో రూ.800 కోట్లు కావాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు మరో రూ.533 కోట్లు కావాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇందులో సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానిజం (ఎస్ఎస్ఎఎం) కింద రూ.178 కోట్లు, రాష్ట్రాభివృద్ధి ప్రణాళిక కింద రూ.355 కోట్లు అవసరమవుతాయి. ఇందులో రూ.178 కోట్లు కేంద్రానికి సంబంధించినవేనని అధికారులు చెబుతున్నారు. కాగా 2023లో 213 మంది రైతులు మరణించినట్లు అధికారులు పేర్కొన్నారు. వీరికి రూ.14.79 కోట్లు అందించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది రూ.22 కోట్లు కావాలని ప్రతిపాదించారు.

దోసపాడు పేదల పట్ల మొండి వైఖరి వీడాలి

- వ్యకాస జిల్లా కార్యదర్శి రామకృష్ణ
- చేపల చెరువుల వద్ద పేదల నిరసన

ప్రజాశక్తి - దెందులూరు (పశ్చిమగోదావరి జిల్లా)

రెవెన్యూ అధికారులు మొండిగా వ్యవరిస్తున్నారని పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు మండలం దోసపాడు గ్రామంలోని చేపల చెరువుల వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన బుధవారం పేదలు నిరసన తెలిపారు. చెరువుల్లోని నీటిని బయటకు పంపి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడు పేదలు, దళితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా రెవెన్యూ అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దళితులపై రెవెన్యూ అధికారులు అక్రమ కేసులు పెట్టే ప్రయత్నం మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దళితుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తుంటే జిల్లా అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. 15 నెలల నుంచి మొక్కవోని దీక్షతో పేదలు పోరాడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. మొదట జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో 32 ఎకరాలు ఉందని చెప్పి, ఇప్పుడు దాన్ని 72 ఎకరాలకు మార్చి పేదలకు చెందిన అసైన్డ్ భూముల రికార్డులను మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత భూముల రికార్డులను పరిశీలించాలని కోరారు. భూ చట్టాలను, హక్కులను కాలరాస్తున్న మండల రెవెన్యూ శాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దోసపాడు పేదల న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం వారికి అండగా నిలవాలని కోరారు. దోసపాడు దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆనంద్‌రావు, నాగేంద్ర, భూ పోరాట నాయకులు రాజు, పవన్, శ్రీను ఏసు, మణి, కుమారి మాణిక్యం పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దోసపాడు పేదలు

दि न्यू इंडिया एश्योरन्स कंपनी लिमिटेड
ది న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్
రిజిష్టర్డు & హెడ్ ఆఫీసు: 87, ఎం.జి.రోడ్డు, ఫోర్టు, ముంబయి-400001.
CIN No: L66000MH1919GOI000526 I IRDA రిజిస్ట్రేషన్ నెం:190

300 మంది సహాయకుల (Asistants) నియామకం

ది న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్, ప్రముఖమైన పబ్లిక్ సెక్టార్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఓపెన్ మార్కెట్ నుండి **300 సహాయకులు (అసిస్టెంట్ల)** రిక్రూట్‌మెంట్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తుంది.

దరఖాస్తు విధానం :
ఆన్‌లైన్ మోడ్ ద్వారా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థిస్తున్నాము 01/02/2024 నుండి 15/02/2024 మధ్య మాత్రమే (రెండు రోజులతోకలిపి). ఇతర మార్గాలు / దరఖాస్తు విధానం ఆమోదించబడవు.

వయస్సు (01/01/2024 నాటికి) :
కనీస వయస్సు: 21 సంవత్సరాలు; గరిష్ట వయస్సు: 30 సంవత్సరాలు.

విద్యార్హతలు (01/01/2024 నాటికి) :
గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి గ్రాడ్యుయేట్ /తత్సమానం. అభ్యర్థులకు దరఖాస్తుచేస్తున్న రాష్ట్రం /యూటి యొక్క ప్రాంతీయ భాషపై పరిజ్ఞానం చాలా అవసరం.

స్థూల వేతనాలు :
సుమారు రూ.37,000/-నెలకు, ప్రారంభంలో మెట్రో నగరంలో ఉంటుంది. ఈ నోటీసు సమాచారం కోసం మాత్రమే. రాష్ట్రం/యూటి& కేటగిరీల వారీగా ఖాళీల వివరాల కోసం మరియు ఆన్‌లైన్ దరఖాస్తు కోసం, దయచేసి మా వెబ్‌సైట్: http://www.newindia.co.in లోని 'రిక్రూట్‌మెంట్ సెక్షన్'ని సందర్శించండి

DGM, CORP. HRM

ముంబయి

ఇండియన్ ఆయిల్‌కి అదిరిపోయే లాభాలు

క్యూ3లో రూ.8,063 కోట్లు



న్యూఢిల్లీ : ప్రముఖ చమురు కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) అత్యంత ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో రూ.8,063.39 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.448 కోట్ల లాభాలు నమోదు చేసింది. దీంతో పోల్చితే అత్యంత ప్రగతిని కనబర్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గిన చమురు ధరలకు తోడు మార్కెటింగ్ మార్జిన్లు పెరగడం ఐఒసికి కలిసి వచ్చింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ స్వల్పంగా రూ.2.24 లక్షల కోట్లకు తగ్గింది. 2022-23 ఇదే డిసెంబర్ త్రైమాసికంలో రూ.2.29 లక్షల కోట్ల రెవెన్యూ ప్రకటించింది.

2023-24 ఏప్రిల్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన కాలంలో ఐఒసి నికర లాభాలు రూ.34,781 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో ఏకంగా రూ.1,817 కోట్ల నష్టాలు చవి చూసింది. 2021-22 తర్వాత తొలిసారి తొమ్మిది నెలల ఫలితాల్లో అత్యధిక నికర లాభాలు సాధించినట్లయ్యింది. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో 2.33 కోట్ల టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను ఐఒసి విక్రయించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో 1.82 కోట్ల టన్నుల ఉత్పత్తుల అమ్మకాలు నమోదు చేసింది. క్యూ3లో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించడంతో బుధవారం బిఎస్ఇలో ఐఒసి షేర్ 4.46 శాతం పెరిగి రూ.145.20 వద్ద ముగిసింది.

ఎయిరిండియాకు రూ.కోటి జరిమానా

న్యూఢిల్లీ : టాటా గ్రూపునకు చెందిన ఎయిరిండియాకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) భారీ షాక్ ఇచ్చింది. భద్రతాపరమైన నిబంధనలు పాటించనందున రూ.1.10 కోట్ల జరిమానా విధించింది. సుదూర ప్రాంతాలు, కీలక మార్గాల్లో ప్రయాణించే ఎయిరిండియా విమానాల్లో భద్రతాపరమైన నిబంధనలు పాటించడం లేదని సంస్థ ఉద్యోగి ఒకరు డిజిసిఎకు రిపోర్ట్ చేశారు. లీజుకు తీసుకున్న విమానాల నిర్వహణ కూడా సరిగా చేపట్టడం లేదని డిజిసిఎ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విచారించిన డిజిసిఎ దర్యాప్తులో నిర్ధారించి... జరిమానా విధించడంతో పాటు షోకాజ్ నోటీసును జారీ చేసింది.

ఈబేలో వెయ్యి మందిపై వేటు

న్యూఢిల్లీ : ఇ- కామర్స్ సంస్థ ఈబేలో 1000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించనుంది.

పొదుపు చర్యల్లో భాగంగా సంస్థలోని 9 శాతం ఉద్యోగులపై వేటు వేయాలని నిర్ణయించింది. ఈ గ్లోబల్ కంపెనీ గడిచిన త్రైమాసికంలో భారీ లాభాలను ఆర్జించినప్పటికీ.. సిబ్బందికి ఉద్వాసన పలకడం గమనార్హం. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 130 కోట్ల డాలర్లు (దాదాపు రూ.10వేల కోట్ల) లాభాలను సాధించింది. కంపెనీలో పనిచేసే మొత్తం ఉద్యోగులు, ఖర్చులు తమ వ్యాపార పెరుగుదల కంటే అధికంగా ఉన్నాయని ఈబే సిఇఒ జేమీ లనోన్ తెలిపారు. ఈ క్రమంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ కార్యకలాపాల్లో సంస్థాగత మార్పులు చేపట్టాలని నిర్దేశిందీంతో ప్రపచంవ్యాప్తంగా కస్టమర్లకు మెరుగైన సేవలు అందించే క్రమంలో సంస్థాగత



మార్పులు చేపట్టామని నిర్దేశించుకున్నామన్నారు. ఇటీవల కాలంలో ఉద్యోగాల తొలగింపు వార్తలు సాధారమయ్యాయి. అమెరికా టెక్ కంపెనీలు మెటా, ట్విటర్, గూగుల్ వంటివి ఉద్యోగులను పెద్ద సంఖ్యలో తొలగిస్తున్న విషయం తెలిసిందే. వెయ్యి మందిని తొలగిస్తున్నట్లు ఈ నెలలోనే గూగుల్ ప్రకటించింది. రాబోయే నెలల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులకు ఉద్వాసనపలికే అవకాశం ఉందని ఇయానోన్ పేర్కొన్నారు.

ఎపిడిడిసిఎఫ్ చైర్మన్‌గా సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా చిల్లకూరి సుధీర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎపిఐఐసి భవనంలోని ఫెడరేషన్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఫెడరేషన్ ఎండి అహ్మద్‌బాబు సమక్షంలో సుధీర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారని, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు, అమూల్ ద్వారా పాల సేకరణ వంటివి సిఎం ఆలోచనల నుండి పుట్టినవేనని చెప్పారు. జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు మద్దతు ధర కల్పించారన్నారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లాకు చెందిన వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



బాధ్యతలు చేపడుతున్న సుధీర్‌రెడ్డి

'పాపాఘ్ని'లో మైనింగ్ జరగడం లేదు : ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి

అన్నమయ్య జిల్లాలో పాపాఘ్ని నది ప్రాంత వెంబడి మైనింగ్ జరగడం లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఈ మేరకు సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రెవెన్యూ, గనులశాఖ అధికారులను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. నది వెంబడి అనుమతులు లేకుండా ఇసుక తవ్వి పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదంటూ అదే జిల్లాలోని జంబుకానిపల్లి గ్రామస్తులు దాఖలు చేసిన పిల్‌పై తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదిస్తూ, పాపాఘ్ని నది వెంబడి విచక్షణారహితంగా ఇసుక తవ్వేస్తున్నారని చెప్పారు. ఈ వాదనను ప్రభుత్వ న్యాయవాదులు పోతిరెడ్డి సుభాష్ రెడ్డి, కె నవీన్ కుమార్ వ్యతిరేకించారు. అక్కడ మైనింగ్ జరగడమే లేదన్నారు.

మనవరాలిపై తాత పైశాచికత్వం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

మనవరాలిపై తాత పైశాచికత్వానికి ఒడిగట్టాడు. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలోని కొత్తపేటకు చెందిన తండ్రీ కొడుకులు ఓ కిరాణా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇద్దరూ వేర్వేరు ఇళ్లలో నివసిస్తున్నారు. ఈ నెల 19న బాలికను తన తండ్రి ప్రసాద్ ఇంటి వద్ద వదిలివెళ్లాడు. సాయంత్రం వచ్చి పాపని తీసుకొని వెళ్లిపోయాడు. 20న ఉదయం బాలికకు స్నానం చేయించే క్రమంలో రక్తపు మరకలను తల్లి గుర్తించి నిలదీసింది. జరిగిన విషయాన్ని బాలిక తల్లికి చెప్పింది. విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని మిన్నకుండిపోయారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన బాలికకు కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు ఫోన్ చేసి విషయం చెప్పారు. బాలికను టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించి స్థానిక పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు:లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీసు 01, ఇ, బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా.
కార్పొరేట్ ఆఫీసు: 2వ అంతస్తు, సెరీన్ చాంబర్స్, రోడ్ నెం.7, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, తెలంగాణ, ఇండియా.
Tel: +91 40 3980 4333 ; Fax : +91 040 3980 4320 ; E-mail: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com
(CIN: L24239AP2005PLC047518)

31 డిసెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం & తొమ్మిది నెలల కాలవ్యవధి కొరకు లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ యొక్క ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్‌ను అనుసరించి సిద్ధం చేయడినవి

(రూ.కోట్లలో)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం			ముగిసిన తొమ్మిది నెలలకు		ముగిసిన సంవత్సరం
		31-Dec-23	30-Sep-23	31-Dec-22	31-Dec-23	31-Dec-22	31-Mar-23
		(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేసినవి)
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	1,194.92	1,224.45	1,544.82	3,601.16	4,659.65	6,040.55
2	కాలవ్యవధి కొరకు నికర లాభం (పన్ను, మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటెంలకు ముందు)	34.62	53.89	277.85	129.09	961.80	1,108.94
3	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత)	34.62	53.89	277.85	129.09	961.80	1,108.94
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత)	23.34	37.12	202.54	87.25	688.16	793.43
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం	22.29	35.47	202.43	82.12	682.44	787.80
6	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత) అట్రిబ్యూటెడ్						
	1) కంపెనీ యొక్క ఈక్విటీ వాటాదారులు	23.14	36.95	203.04	84.94	687.13	790.11
	2) నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్‌లు	0.20	0.17	(0.50)	2.31	1.03	3.32
7	కాలవ్యవధి అట్రిబ్యూటెడ్ కొరకు పూర్తి సమగ్ర ఆదాయం						
	1) కంపెనీయొక్క ఈక్విటీ వాటాదారులు	22.09	35.30	202.93	79.81	681.41	784.53
	2) నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్‌లు	0.20	0.17	(0.50)	2.31	1.03	3.27
8	ఈక్విటీ వాటా మూలధనం	107.79	107.73	107.73	107.79	107.73	107.73
9	ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివ్యాల్యూవేషన్ రిజర్వు మినహాయించి) మరియు నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్‌లు						3,929.80
10	వాటా ఒక్కింటికి రాబడి (రూ.2/- చొప్పున)						
	1. బేసిక్ : రూ. *	0.43	0.69	3.78	1.58	12.79	14.69
	2. డైల్యూటెడ్: రూ. *	0.43	0.68	3.76	1.57	12.74	14.64

* ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కాలవ్యవధి కొరకు వార్షికం కానివి.

గమనికలు:

1. 31 డిసెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కాలానికి ఆడిట్‌చేయని స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలపై అదనపు సమాచారం.

(రూ.కోట్లలో)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం			ముగిసిన తొమ్మిది నెలలకు		ముగిసిన సంవత్సరం
		31-Dec-23	30-Sep-23	31-Dec-22	31-Dec-23	31-Dec-22	31-Mar-23
		(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేయనివి)	(ఆడిట్‌చేసినవి)
1	ఆపరేషన్ల నుండి పూర్తి రెవెన్యూ	1,132.19	1,158.03	1,500.70	3,397.87	4,494.11	5,773.45
2	పన్నుకు ముందు లాభం	56.70	63.21	270.34	137.16	914.63	1,051.43
3	పన్ను తరువాత లాభం	42.64	46.67	199.05	102.38	658.10	760.38
4	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం	41.42	45.44	198.91	98.71	657.65	761.17

2) సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్చేంజితో దాఖలు చేయబడిన త్రైమాసికం/ తొమ్మిది నెలల కాలానికి ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం పై విధంగా ఉన్నవి. త్రైమాసికం/ తొమ్మిది నెలల కాలానికి ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్చేంజి వెబ్‌సైట్ మరియు కంపెనీ పేరు నందు www.bseindia.com, www.nseindia.com and www.lauruslabs.com నందు అందుబాటులో ఉన్నాయి.

3) ఆడిట్ కమిటీచే సమీక్షించినట్లుగా కంపెనీ యొక్క పై పేర్కొన్న ఆర్థిక ఫలితాలు 24 జనవరి, 2024న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.

బోర్డు ఆదేశాల మేరకు
లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ తరపున
డా. సత్యనారాయణ చావ
పూర్తికాలిక డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ప్రదేశం: హైదరాబాద్
తేది: 24 జనవరి, 2024

సంపాదకీయం


మంచు...ముప్పు

వాతావరణ సంక్షోభం తీవ్రంగా ముంచుకొస్తున్న వేళ మంచుఖండం అంటార్కిటికా శరవేగంగా కరిగిపోతోందంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. భూమి నాలుగు కాలాలపాటు చల్లగా ఉండాలంటే అంటార్కిటికాలో పెనుమార్పులు చోటు చేసుకోకూడదని పర్యావరణ వాదులు చెబుతారు. దానికి భిన్నంగా జరిగితే మానవాళికి పెను ముప్పు తప్పదని వారు ఎప్పటి నుండో హెచ్చరిస్తున్నారు. ఇప్పుడు ఆ ముప్పు ముంచుకొచ్చిన సంకేతాలు కనిపిస్తున్నాయి. కార్పొరేట్ల కాసుల కక్కుర్తి కారణంగా ఏటికేడాది పెరుగుతున్న కర్బన ఉద్గారాలు భూతాపాన్ని పెంచుతున్న సంగతి తెలిసిందే. భూమి వేడెక్కుతున్న ప్రభావం మంచుఖండంపై తీవ్రంగా పడుతోంది. శరవేగంగా మంచు కరిగిపోతోంది. తాజాగా విడుదలైన ఒక నివేదిక ప్రకారం 2023లో దాదాపు 365 రోజులు ఈ ఖండంపై మంచు కరగడం కొనసాగింది. ఈ ఖండం చుట్టూ ఉండే మంచుతో కప్పిన సముద్రప్రాంతం ఏడాది పొడవునా నిర్దేశించిన ప్రమాణాల కన్నా తక్కువగా కనపడింది. ఈ పరిణామం శాస్త్రవేత్తలను దిగ్భ్రాంతికి గురిచేసింది. గతంలో కూడా సముద్రపు మంచు కరిగిన సందర్భాలు ఉన్నప్పటికీ, ఇలా దాదాపు సంవత్సరం మొత్తం ఉండవలసిన దానికన్నా తక్కువగా కనపడటం గతంలో ఎన్నడూ లేదని వారు అంటున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం 2023లో అంటార్కిటికా 1.5 మిలియన్ చదరపు కిలోమీటర్లకంటే ఎక్కువ మంచును కోల్పోయింది. ఇది గత కొన్ని దశాబ్దాలతో పోల్చుకుంటే మూడు రెట్లు ఎక్కువ! 1979లో ఉపగ్రహ ఆధారిత గణన విధానం మొదలైనప్పటి నుండి ఇదే అత్యల్పమని చెబుతున్నారు. నిజానికి 2022వ సంవత్సరంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అప్పటికి అదే అత్యధికమని శాస్త్రవేత్తలు ప్రకటించగా, 2023లో అంతకన్నా ఎక్కువగా మంచు కరిగింది. గత ఏడాది ఫిబ్రవరిలో అంటార్కిటికా ఖండపు తీర రేఖలో మూడింట రెండు వంతుల భాగం ఏమాత్రం మంచు లేకుండా కనిపించింది. అంటార్కిటికా తీర ప్రాంతం అలా కనపడటం అదే మొదటిసారి!

ప్రపంచవ్యాప్తంగా కర్బన ఉద్గారాల విడుదలలో ఏమాత్రం తగ్గుదల లేకపోవడం, వాతావరణ మార్పులు కొనసాగుతుండటంతో రానున్న మరికొన్ని సంవత్సరాలు కూడా ఇదే పరిస్థితి కొనసాగే ప్రమాదం ఉంది. సమీప భవిష్యత్తులో ఈ పరిస్థితి మారే అవకాశం లేదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. 'భూ తాపం ప్రభావం కొన్ని సంవత్సరాలుగా అంటార్కిటికాపై పడుతోంది. వాతావరణ కాలుష్యం పెద్ద ఎత్తున కొనసాగుతున్న నేపథ్యంలో ఇక్కడ మంచు కరగడం కొనసాగుతుంది. మంచు కరుగుతున్న వేగంలోనూ మార్పు ఉండకపోవచ్చు. మార్పు ఉంటుందని అనుకోవడం అత్యాశే' అని యూనివర్శిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఈ పరిణామం మానవాళికి పెనుముప్పు అని హెచ్చరించింది.

అంటార్కిటికా ఖండంపై 2,54,00,000 క్యూబిక్ కిలోమీటర్ల మంచు ఉందని అంచనా. ఇది భూమి మీద ఉన్న మొత్తం మంచినీటిలో 60 శాతం, మొత్తం మంచులో 90 శాతం ఉంటుందని అంచనా. ఇంత పెద్దమొత్తంలో ఉన్న మంచుకరిగిపోతే సముద్రనీటి మట్టాలు భారీగా పెరగనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సగటున సముద్ర మట్టం 70 మీటర్లు పెరిగే అవకాశం ఉందని ఒక అంచనా. దీంతో అనేక దేశాలు ముంపు బారిన పడనున్నాయి. డెన్మార్క్, నెదర్‌ల్యాండ్స్, బంగ్లాదేశ్, బ్రిటన్, ఉరుగ్వే వంటి దేశాలు భారీగా నష్టపోతాయి. చిన్న ద్వీప దేశాల ఉనికి లేకుండా పోతోంది. మన దేశంలోనూ కోల్‌కతా, చెన్నై వంటి నగరాలు ముంపు బారిన పడనున్నాయి. మన రాష్ట్రంలోనూ అన్ని తీరప్రాంత నగరాలు, పట్టణాలకు అదే దుస్థితి దాపురించే ప్రమాదం ఉంది. మన దేశం చుట్టూ ఉన్న సముద్రాల నీటిమట్టం 20 నుండి 30 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సముద్రాల వాతావరణం గణనీయంగా మారుతుందని, ఫలితంగా రుతుపవనాల్లో కూడా భారీ మార్పులు వస్తాయని అంటున్నారు. అయితే, అంటార్కిటికాపై ఉన్న మంచు కనీసం కొన్ని దశాబ్దాలపాటు పూర్తి స్థాయిలో కరగదని శాస్త్రవేత్తలు చెబుతుండటమే కొంత ఊరట. ఏమైనప్పటికీ అట్టహాసంగా నిర్వహించే వాతావరణ సదస్సులు పేరు గొప్ప, ఊరు దిబ్బగా మారకుండా ఐక్యరాజ్యసమితి తగిన చర్యలు తీసుకోవాలి. వాతావరణాన్ని ధ్వంసం చేసే ధనిక దేశాల విచ్చలవిడి చర్యలకు కళ్లెం వేయాలి. అప్పుడే అంటార్కిటికాతో పాటూ భూ గోళాన్ని కాపాడుకోగలం.

మహనీయుల మాట



ఎన్ని అందమైన పేర్లు వున్నప్పటికీ బానిసత్వం నీచమైనది.

- మౌలానా అబుల్ కలామ్ అజాద్,
స్వతంత్ర భారత తొలి విద్యా శాఖా మంత్రి.

ఆలయ ధ్వజం, రాజ్యాంగం ఒక్కటే కాదు!

విశ్లేషణ




రామచంద్ర గుహ

నా రచనలు చదివే చాలామంది లాగే నేను కూడా ప్రతి ఉదయం పత్రికలు చూడడంతో మొదలెడతాను. మొదట ఆన్‌లైన్‌లోనూ తర్వాత అచ్చులోనూ చూస్తుంటాను. జనవరి ఏడున ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ఆన్‌లైన్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ గుజరాత్‌లో కొన్ని దేవాలయాలు సందర్శించడం గురించి ఇచ్చిన కథనంతో మొదలుపెట్టాను. ప్రసిద్ధమైన సోమనాథ్ దేవాలయం కూడా వెళ్లారు. నేను చదివిన కథనంతో పాటు ఇచ్చిన ఫోటోలో సిజెఐ దంపతులు హిందువులు చాలా పవిత్రంగా పరిగణించే ప్రఖ్యాతమైన ద్వారకాధీశ్ ఆలయాన్ని సభక్తికంగా సందర్శిస్తున్న దృశ్యం వుంది. తాను మహాత్మా గాంధీ జీవితాదర్శాలతో ప్రేరణతో వివిధ రాష్ట్రాల సందర్శన చేస్తున్నట్టు సిజెఐ చెప్పినట్టు ఆ కథనంలో వుంది. న్యాయ వ్యవస్థను ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకోవడానికి పరిష్కారాలు కనుగొనడానికి చేస్తున్న ఈ పర్యటనలలో భాగంగానే గుజరాత్ వచ్చినట్టు ఆయన చెప్పారట. ఆయన గాంధీజీ గురించి చేసిన ఈ ప్రస్తావనే నన్ను ఆశ్చర్యపరచింది. ఎందుకంటే నేను లాయర్‌నో న్యాయమూర్తినో కాకపోయినా మహాత్మా గాంధీ జీవితం, వారసత్వం గురించి చాలా దశాబ్దాల పాటు అధ్యయనం చేస్తూ గడిపాను.

దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత గాంధీ ఒక ఏడాది పాటు దేశమంతటా రైళ్లలో తిరుగుతూ పర్యటించిన సంగతి బాగా తెలిసిన విషయమే. ప్రజా జీవితంలోకి ప్రవేశించే ముందు అన్ని అంశాలు ఆకళింపు చేసుకోవడానికే ఆయన పర్యటించారు. తర్వాత కాలంలో ఒక సంఘ సంస్కర్తగా, రాజకీయ నాయకుడుగా పని చేసే సమయంలోనూ గాంధీ దేశమంతా తిరుగుతూనే వున్నాడు. ఎక్కువగా రైలులోనూ ఎద్దుల బళ్లలోనూ చాలా సార్లు కాలి నడకతోనూ కూడా పర్యటించాడు. అయితే ధనికులు, పేదలు, ప్రసిద్ధులు, అనామకులు, స్త్రీలు, పురుషులు ఎవరైనా సరే దేశం గురించి ప్రజల గురించి బాగా లోతుగా అవగాహన పెంచుకోవడానికి పర్యటిస్తామంటే గాంధీ ఆమోదించేవాడు.

గాంధీ ఇలా చేసి వుండేవాడా?

అయితే ఒక ప్రధాన న్యాయమూర్తి దేవాలయాలు సందర్శిస్తూ అక్కడ ఫోటోలు తీయించుకుని ఆ క్రమంలో ఇంటర్వ్యూలు కూడా ఇవ్వడాన్ని గాంధీ ఎలా చూసి వుండేవాడు? గాంధీ తనుగా ఎప్పుడూ ఒక హిందూ దేవాలయానికి వెళ్లలేదు. 1946లో మదుర మీనాక్షి ఆలయంలో చాలా కాలం నిషేధాల తర్వాత, దళితుల ప్రవేశాన్ని అనుమతించినపుడు మాత్రమే సందర్శించాడు. ఇలాంటి మినహాయింపులు చాలా తక్కువే వుంటాయి. తాను హిందువునని అభివర్ణించుకున్నాడు. కానీ ఆయన ఎంచుకున్న పూజా మార్గం మాత్రం సర్వ మత ప్రార్థనే. అది కూడా ఆరుబయిట హిందూ, ముస్లిం, పార్సీ, సిక్కు, జైన, క్రైస్తవ తదితర మతాల వారంతా కలిసి సామూహిక ప్రార్థన చేసే విధానంలోనే. వారందరూ వారి వారి మత గ్రంథాలను కలసి పఠించే పద్ధతినే పాటించేవారు. భారత దేశం సకల మతాల సమానతకు సంబంధించినదని చెప్పేందుకు ఆయన ఎంచుకున్న తనదైన ఎంతో లోతైన అర్థంతో మనసును కదిలించే విధానమది.



అయితే ఒక ప్రధాన న్యాయమూర్తి దేవాలయాలు సందర్శిస్తూ అక్కడ ఫోటోలు తీయించుకుని ఆ క్రమంలో ఇంటర్వ్యూలు కూడా ఇవ్వడాన్ని గాంధీ ఎలా చూసి వుండేవాడు? గాంధీ తనుగా ఎప్పుడూ ఒక హిందూ దేవాలయానికి వెళ్లలేదు. 1946లో మదుర మీనాక్షి ఆలయంలో చాలా కాలం నిషేధాల తర్వాత, దళితుల ప్రవేశాన్ని అనుమతించినపుడు మాత్రమే సందర్శించాడు. ఇలాంటి మినహాయింపులు చాలా తక్కువే వుంటాయి. తాను హిందువునని అభివర్ణించుకున్నాడు. కానీ ఆయన ఎంచుకున్న పూజా మార్గం మాత్రం సర్వ మత ప్రార్థనే. అది కూడా ఆరుబయిట హిందూ, ముస్లిం, పార్సీ, సిక్కు, జైన, క్రైస్తవ తదితర మతాల వారంతా కలిసి సామూహిక ప్రార్థన చేసే విధానంలోనే. వారందరూ వారి వారి మత గ్రంథాలను కలసి పఠించే పద్ధతినే పాటించేవారు. భారత దేశం సకల మతాల సమానతకు సంబంధించినదని చెప్పేందుకు ఆయన ఎంచుకున్న తనదైన ఎంతో లోతైన అర్థంతో మనసును కదిలించే విధానమది.

సుప్రీంకోర్టు ప్రాంగణంలో లేక మరెక్కడైనా భారత ప్రధాన న్యాయమూర్తి తనలా సర్వ మత ప్రార్థనలు చేయాలని గాంధీ కోరుకుని వుండడు. ఆశించి వుండడు కూడా. మనం కూడా అలా కోరుకోవద్దు. హిందూ మత విశ్వాసాలను ప్రగాఢంగా అనుసరించే ఒక మాజీ ప్రధాన న్యాయమూర్తి నాకు తెలుసు. ఆయన కూడా ప్రతిరోజూ ఉదయం ప్రార్థనతో మొదలుపెట్టి ప్రార్థనతో ముగిస్తారని నాకు తెలుసు. అయితే అది తన పూజగది లోనే చేస్తారు. ఆ సిజెఐ పదవీ కాలం గురించి ఇప్పటికీ ప్రశంసాపూర్వకంగా మాట్లాడుతుంటారు. ఆయన ఆలయాలు సందర్శించేవారు గానీ ప్రచార పూర్వకంగా వెళ్లి ఫొటోలు అనుమతించేవారు కాదు. అది కూడా ఈ సందర్భంలో. అయోధ్యలో నూతన ఆలయం ఘనంగా జరుగుతున్న ప్రారంభోత్సవానికి పది రోజుల ముందు, అది కూడా హిందూ భక్తి సమర్పణంగా గాక హిందూత్వ ఆధిక్యతా వాద ప్రదర్శనగా జరుగుతున్న సమయంలో అసలే ఇలా చేసేవారు కాదు.

ఆ ధ్వజం, రాజ్యాంగం ఒకటేనా?

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనంలో సిజెఐ చేసిన మరికొన్ని వ్యాఖ్యానాలు కూడా వున్నాయి. అవి ఆలోచించవలసినవే. సోమనాథ్, ద్వారాకాధీశ ఆలయాల సందర్శన సమయంలో తాను దర్శించిన ధ్వజాలను గురించి కూడా ఆయన ప్రస్తావించారు. "ద్వారాకాధీశ ఆలయ ధ్వజం చూసిన నేను చాలా ఉత్తేజపడ్డాను. అది పూరీ జగన్నాథ ఆలయంలో చూసిన దానిలాగే వుంది. మన దేశంలో ప్రతి చోటా వున్న ఈ సంప్రదాయం మనను కలిపివుంచుతుంది. ఆ ధ్వజంపైన శక్తి ఏదో వుంది. అది మనలను, లాయర్లను, జడ్జిలను, పౌరులను, అందరినీ కలిపి వుంచుతుంది. అదే మానవత్వం. చట్టబద్ధ పాలన రాజ్యాంగం అనే వాటితో పాలించబడే మానవత అని ఆయన అన్నారు. ఈ మాటలు సిజెఐ అన్నవి అన్నట్టే పొందుపరిచారని అనుకుంటున్నా. అదే నిజమైతే ఆయన మన ప్రాచీన ఆధునిక చరిత్రల గురించి చేసిన వ్యాఖ్యానాలు విమర్శనాత్మక పరీక్షకు నైతిక ప్రమాణాలకు కూడా నిలబడవని గౌరవంగానే చెప్పవలసి వుంటుంది.

ఆలయాల ధ్వజాలు అందరినీ ఒకే మానవులుగా కలిపి వుంచలేదు. నిజానికి ఆ ధ్వజాలు కూడా అన్నిటికీ ఒకటిగా వుండవు. సిజెఐకి బాగా తెలిసిన విషయమే. మన హిందూ ఆలయాలు చరిత్రలో చాలా కాలం పాటు దళితులను అనుమతించలేదు. ఆలయాల పూజారులు వారిని లోపలికి వచ్చి పూజలు చేసుకోనివ్వలేదు. మహిళలను కూడా రుతు సమయంలో అనుమతించేవారు కాదు. ఇదేగాక ఆర్థిక, రాజకీయ, అధికార పరంగానూ సామాజికంగానూ దళితులను మహిళలను అనేక విధాల వివక్షకు గురి చేశారు. మహాత్మా గాంధీ వల్ల పూరీ శంకరాచార్య ధ్వజం వల్ల ఉత్తేజం పొందానంటున్న ఆయనకు మరో విషయం చెప్పాలి. గాంధీ దళితులను ఆలయాలలోకి అనుమతించాలని ఉద్యమించిన తర్వాత కొంతమంది జాతీయ నాయకులు వలసవాద జాతీయ శాసనసభలో ఆలయ ప్రవేశ బిల్లు ప్రతిపాదించారు. అప్పుడు ఈ పూరీ శంకరాచార్యుడే దాన్ని వ్యతిరేకిస్తూ వైస్రాయ్‌కి లేఖ రాశారు.

సవర్ణులను, దళితులను ఒకేసారి కలసి ప్రార్థించేలా అనుమతించడం సనాతన ధర్మాన్ని సమూలంగా నాశనం చేస్తుందని ఫిర్యాదు చేశారు. వారి ధార్మిక ఆధ్యాత్మిక జీవిత ప్రశాంతతను భగ్నం చేస్తుందని వాపోయారు. అసలు గాంధీని హిందూ బాహ్యుడుగా ప్రకటించాలని ఇంకొందరు ఆచార్యులు, పూజారులు సంతకాల సేకరణ జరిపారు. సిజెఐ చెబుతున్నట్టు కాకుండా సనాతన హిందూ సంప్రదాయానికి రాజ్యాంగ ఆదర్శాలకు మధ్య చాలా అంతరం వుంది. గాంధీ, అంబేద్కర్, జ్యోతీరావ్ పూలే, సావిత్రీబాయి పూలే, గోఖలే, రనడే వంటి అనేకమంది సంస్కర్తల నిర్విరామ కృషి ఫలితమే రాజ్యాంగం. హిందూ శాస్త్రాలలో లిఖితమై ఆచరించ బడుతున్న అనేక వివక్షలను వారు సవాలు చేసిన ఫలితమే అది. గమనించాల్సిందేమంటే రాజ్యాంగం అస్పృశ్యతను నిషేధించిన తర్వాత కూడా హిందూ సంప్రదాయంలో ప్రసిద్ధమైన పూరీ బద్రీనాథ్ వంటి చోట్ల ఆ దురాచారం దశాబ్దాల పాటు కొనసాగుతూనే వచ్చింది. ఇటీవలనే 2023 జులైలో కూడా ఉత్తరాఖండ్, దేవభూమి వంటి చోట్ల దళితులకు ప్రవేశం లేదని వార్తలు వచ్చాయి.

ఇప్పటికీ వివక్షలు, అసమానతలు

పురుషులకన్నా మహిళలను తక్కువగా చూడటం కూడా 1950వ దశకం వరకూ హిందూ చాందసులు కొనసాగిస్తూనే వచ్చారు. పూరీ శంకరాచార్యులే సతీసహగమనాన్ని 1988లో కూడా సమర్థించినట్టు వార్తా కథనాలు చూశాం. వేదాలను పఠించడానికి వాటిపై వ్యాఖ్యానం చేయడానికి స్త్రీలు దళితులు అనర్హులని ఆయన సెలవిచ్చారు కూడా. ఏ సంప్రదాయం కూడా స్థిరోభవా అంటూ వుండదనేది నిజమే, అయితే గాంధీ పూలే అంబేద్కర్ వంటి వారు సవాలు చేసి వుండకపోతే పూరీ ద్వారక వంటి చోట్ల వాటి వాటి అప్రజాస్వామిక సమానతా వ్యతిరేక ఆచారాలు యథాతథంగా కొనసాగుతూ వుండేవి. వారు క్షేత్ర స్థాయిలో కుల వివక్షలపై పోరాడారు. అలాగే అంబేద్కర్ నాయకత్వంలో భారత రాజ్యాంగ సభ మనుధర్మ శాస్త్రాన్ని తోసిపుచ్చి ప్రజాస్వామ్య సమానతా సూత్రంతో కూడిన రాజ్యాంగాన్ని ఆమోదించి వుండకపోతే అది మరోలా వుండేది.

అందువల్ల ప్రధాన న్యాయమూర్తి గారు సంప్రదాయంగా హిందూ దేవాలయా లపై ఎగిరే ధ్వజ పతాకాలనూ భారత రాజ్యాంగం ఆధునిక సూత్రాలకూ మధ్య ఒకే విధమైన సారూప్యత చూడటం ఉద్దేశపూర్వకంగా దారితప్పించడం అవుతుంది (ఇది కూడా చాలా సుతిమెత్తగా చెబుతున్న విమర్శ). భారత రాజ్యాంగం గురించి మహా చరిత్రకారుడు గ్రాన్‌వెల్లి ఆస్టిన్ చెప్పిందేమిటో ఆయనకూ మనకూ కూడా గుర్తుండడం అవసరం. "పారమార్థ లక్ష్యాల సాధన కోసం అహేతుక పద్ధతులను విస్తారంగా పాటించే ఒక దేశ ప్రజానీకానికి సంబంధించి నంత వరకూ అదో మహత్తరమైన ముందంజే".

తలెత్తే ప్రశ్నలివే!


సిజెఐ ఆలయ దర్శనానికి సంబంధించి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన ఫోటోను కూడా నేను ప్రస్తావించాను. గుజరాత్‌లో ఆలయాలకు ఆయన కాషాయ కుర్తా ధరించి వెళ్లారు. ఒకవేళ ఆయన తెల్లటి దుస్తులు లేదా ఆకుపచ్చ రంగువి వేసుకుని వెళ్లినా సరే, మన దేశ చరిత్రలోని ఈ సమయంలో ఒక పదవిలోని ఒక ప్రధాన న్యాయమూర్తి ఆలయాలకు ఇంత అధికారికంగా వెళ్లడం-ఆయన వ్యక్తిగత విషయాలలో ఆయన తీర్పును గురించి ఇబ్బందికరమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. అంతేగాక దాన్ని సమర్థించుకోవడం కోసం ఆయన కొన్ని వ్యాఖ్యానాలు చేశారు. భారత రాజ్యాంగానికి హిందూ సంప్రదాయానికి మధ్యన ఒక నిరంతరాయత, సమాన లక్షణాలు వున్నాయని చెప్పడం చూస్తే ఆయన ఆలోచనా శక్తి గురించిన సందేహం కలుగుతుంది.

/ వ్యాసకర్త ప్రముఖ చరిత్రకారుడు/

గాంధీజీని ఎందుకు చంపినట్లు?

సందర్భం





ఎస్. వినయకుమార్

జాతి పిత చివరి మాట "హే రాం"లో బాధ, వేదన ఉంది. కష్ట సమయాల్లోనూ హే రాం లేదా రామా అని తలచుకోవడం హిందువులకు అలవాటు. కాని బిజెపి అండ్ కంపెనీ ఎంచుకొన్న 'జై శ్రీరాం' నినాదంలో బాధ లేదు, భక్తి లేదు. కసి మాత్రమే ఉంది. ఈ కసి ఎవరి మీద అంటే దేశపౌరుల్లో భాగమైన ముస్లిం, క్రైస్తవుల మీద. అవి విదేశీ మతాలని వాటికి దేశంలో స్థానం లేదని అంటారు.... శాంతి కాముకులైన భారతీయులను రెచ్చగొట్టడానికి 'జై శ్రీరాం' నినాదాన్ని వారు వాడుకొంటున్నారు. ఇంతకూ గాంధీజీ చేసిన పాపం ఏమిటంటే భారతీయులందరినీ స్వాతంత్ర్య పోరాటంలో ఒక తాటి మీదికి తేవడమే. ఆ తాడునే ఆర్‌ఎస్‌ఎస్ హిందూ మహాసభలు మహాత్ముడిని చంపడానికి వాడాయి.

మహాత్మా గాంధీని మతోన్మాదులు పొట్టన పెట్టుకొని 75 ఏళ్లు పూర్తికానున్నాయి. 1948 జనవరి 30వ తేదీన ఆర్‌ఎస్‌ఎస్, హిందూ మహాసభ అనుచరులైన నాథురాం గాడ్సే, నారాయణ్ ఆప్టేల బృందం కుట్ర చేసి గాంధీజీని దేశ రాజధాని ఢిల్లీలో హత్య చేసింది. ఆ కుట్రలో వినాయక్ రావు దామోదర్ సావర్కర్ కూడా ఉన్నారని పోలీసులు ఆయన్ని బోనెక్కించినా సమగ్ర దర్యాప్తు జరగని కారణంగా ఆయన బయటపడినట్లు అప్పటి పోలీసు ఉన్నతాధికారులు ఆ తర్వాత చెప్పారు.

దేశ విభజన సందర్భంగా పంజాబ్, బెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన మారణకాండలో వేలకు వేల హిందువులు, సిక్కులు ముస్లింలు నిరాశ్రయులయ్యారు, మరణించారు. ఆ మారణకాండ రాజధాని ఢిల్లీకి కూడా చేరింది. శాంతి భద్రతల కోసం చేసిన విజ్ఞప్తులు ఫలించలేదు. ద్వేషాగ్నులను చల్లబర్చుడానికి గాంధీజీ మొదట నైఖాళీలో ఆ తర్వాత ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వెనువెంటనే చేసిన ఆ రెండు నిరాహార దీక్షల వల్ల ఏర్పడిన బలహీనత నుండి గాంధీ పూర్తిగా కోలుకోలేదు. మను, తను భుజాలపై చేతులు వేసి అడుగులలో అడుగేసుకొంటు బిర్లా హౌస్‌లోని ప్రార్థనా వేదిక వైపు నడుస్తుండగా ఆయనకు అతి దగ్గరగా వచ్చిన గాడ్సే తుపాకీతో మూడు సార్లు కాల్పులు జరిపారు. "హే రాం" అంటూ నేలకొరిగారు. శారీరకంగా బలహీనంగా ఉన్న గాంధీజీ ప్రాణాలు అనంత వాయువుల్లో కలవడానికి అట్టే సమయం పట్టలేదు. గాంధీజీ హత్యకు అవసరమైన డబ్బులు ఎలా సేకరించిందీ, దేనికెంత ఖర్చు చేసింది పక్కాగా రాసుకున్న పాకెట్ నోటు బుక్కు ఘటనా స్థలంలోనే గాడ్సే జేబులో దొరికింది. పోలీసులు ఆ నోట్ బుక్ ద్వారా కొద్ది సమయంలోనే ఆ కుట్రలో పాల్గొన్నా బృందాన్నంతటినీ అరెస్టు చేసింది.

కోపోద్రిక్తులైన ప్రజలు తెల్లవారేలోగా ఆర్‌ఎస్‌ఎస్ ఆఫీసులపై, బొంబాయిలోని సావర్కర్ సదన్‌పై దాడి చేశారు. పోలీసులు వేగంగా స్పందించడం వల్ల సావర్కర్, అలాగే లిమాయే వంటి ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు బతికిపోయారు. గాడ్సే తల్లిదండ్రులను జిల్లా కలెక్టర్ కాపాడారు. గోద్రాలో జరిగిన ఘోర ఉదంతం అనంతరం ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ దేశ ప్రధానిగా ఉండిన అటల్ బిహారీ వాజ్‌పేయి వ్యవహరించిన తీరుకు గాంధీ హత్య జరిగిన నాడు బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండిన మొరార్జీ దేశాయి, భారత ప్రధానిగా ఉండిన జవహర్ లాల్ నెహ్రూ శాంతి భద్రతల రక్షణ కోసం స్పందించిన తీరుకు మధ్య ఎలాంటి పోలికా లేదు. ఇందిరా గాంధీ హత్య తర్వాత ఢిల్లీలో జరిగిన మారణకాండ సందర్భంగా కాంగ్రెస్ నాయకత్వం వ్యవహరించిన తీరు కూడా దుర్మార్గమైనది. గాంధీజీ హత్య కేసును లాల్ ఖిలాలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి విచారించారు. గాడ్సే, ఆప్టేలకు మరణశిక్ష పడింది. సావర్కర్ మినహాయించి మిగతా నిందితులందరికీ శిక్షలు పడ్డాయి. కింది కోర్టు తీర్పును గాడ్సే బృందం అంబాలలో ఆ నాటి పంజాబ్ హైకోర్టులో సవాల్ చేసింది. హైకోర్టు కింది కోర్టు తీర్పును ధృవపర్చింది.

తను అరెస్టయ్యాక సావర్కర్ ఒక్కసారి కూడా తనవైపు కనీసం చూడలేదని గాడ్సే చాలా బాధపడ్డాడు. ఆ బాధను పలు మార్లు తన న్యాయవాదితో గాడ్సే చెప్పుకున్నాడు. గాంధీజీ హత్య గర్హనీయమని అప్పటి ఆర్‌ఎస్‌ఎస్ అధినాయకుడు గోల్వాల్కర్ ఆలస్యం చేయకుండా ప్రకటించారు. గాడ్సే ఆ సమయంలో తమ సభ్యుడు కాదని చెప్పారు. కాని ఆర్‌ఎస్‌ఎస్ సభ్యత్వ రికార్డులను నిర్వహించిన నాగ్‌పూర్ లోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సోదా చేసినప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో గాడ్సే పాల్గొన్నట్లు మినిట్స్‌లో లభించింది.

తమ రెండవ ప్రయత్నంలో గాడ్సే బృందం గాంధీజీని హత్య చేయగల్గింది. మొదటి ప్రయత్నానికి బయల్దేరే ముందు గాడ్సే, ఆప్టేలు పూనా నుండి తమ బృందంతో ముంబాయికి వచ్చి హిందు మహాసభ ఆఫీసులో సావర్కర్‌ను విడిగా కలిసినట్లు సాక్ష్యాలు ఉన్నాయి. వారిని సాగనంపుతూ సావర్కర్ జయీభవ అని దీవించినట్లు, ఆ ముసలాడికి నూకలు చెల్లాయని వాఖ్యానించినట్లు మాత్రం పోలీసులకు సాక్ష్యం దొరికింది. స్వాతంత్ర్య సమర యోధుడిగా అండమాన్ జైలుకు వెళ్లిన సావర్కర్ బ్రిటిష్ ప్రభుత్వం పెట్టిన క్షమాభిక్షతో జైలు నుండి బయటికి వచ్చాడు. క్షమాభిక్ష దరఖాస్తులో ఇచ్చిన హామీ మేరకు ఆయన బ్రిటిష్ వ్యతిరేక పోరాటాల్లో పాల్గొనలేదు. తనను జైలు నుండి విడిపించడంలో ప్రధాన పాత్ర వహించిన మూంజే అధ్యక్షతన ఉన్న హిందూ మహాసభలో చేరాడు. మూంజే తర్వాత సావర్కర్ హిందూ మహాసభ అధ్యక్షుడయ్యారు.

సావర్కర్ రత్నగిరి జిల్లా నుండి బయటికి వెళ్లరాదన్న ఆంక్షలు వైదొలిగాక అప్పటి ఆర్‌ఎస్‌ఎస్ సంస్థాపక అధినేత హెడ్గేవార్ మహారాష్ట్ర అంతటా సావర్కర్‌కు స్వాగత సభలు ఏర్పాటు చేసి బ్రహ్మరథం పట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ యంత్రాంగాన్నంతా ఆ పనిలోకి దించారు. తాను స్వయంగా కొన్ని సభల్లో పాల్గొన్నారు. మూంజే తన పర్యటన సందర్భంగా, ఇటలీ వెళ్లి ఫాసిస్టు నాయకుడు ముస్సోలినీని, ఆయన ఇతర సహచరులను కలిసి స్ఫూర్తి పొందారు. స్వాతంత్ర్యోద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్, హిందూ మహాసభలు రెండూ పాల్గొనలేదు. ఇప్పుడు సావర్కర్‌ను కేంద్రంలోకి మోడీ ప్రభుత్వం నెత్తిన పెట్టుకొంది. అండమాన్ విమానాశ్రయానికి సావర్కర్ పేరు పెట్టింది. పార్లమెంట్ లో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించింది.

జాతి పిత చివరి మాట "హే రాం"లో బాధ, వేదన ఉంది. కష్ట సమయాల్లోనూ హే రాం లేదా రామా అని తలచుకోవడం హిందువులకు అలవాటు. కాని బిజెపి అండ్ కంపెనీ ఎంచుకొన్న "జై శ్రీరాం" నినాదంలో బాధ లేదు, భక్తి లేదు. కసి మాత్రమే ఉంది. ఈ కసి ఎవరి మీద అంటే దేశపౌరుల్లో భాగమైన ముస్లిం, క్రైస్తవుల మీద. అవి విదేశీ మతాలని వాటికి దేశంలో స్థానం లేదని అంటారు. దేశీయ మతాలైన జైనం, బౌద్ధాలను వారేదో ఉద్ధరించారనుకొంటే అదీ లేదు. శాంతి కాముకులైన భారతీయులను రెచ్చగొట్టడానికి 'జై శ్రీరాం' నినాదాన్ని వారు వాడుకొంటున్నారు. ఇంతకూ గాంధీజీ చేసిన పాపం ఏమిటంటే భారతీయులందరినీ స్వాతంత్ర్య పోరాటంలో ఒక తాటి మీదికి తేవడమే. ఆ తాడునే ఆర్‌ఎస్‌ఎస్ హిందూ మహాసభలు మహాత్ముడిని చంపడానికి వాడాయి. గాంధీజీ ముస్లింలను సంతృప్తి పరచడానికే దేశ విభజనకు ఒప్పుకొన్నారని నేరం మోపాయి. భారతదేశంలో హిందూ, ముస్లింలు రెండు జాతులున్నాయని మొదట చిచ్చు పెట్టింది సావర్కరే. చాలాకాలం తర్వాత దాన్ని అంది పుచ్చుకొంది మహ్మదాలీ జిన్నా. గాంధీజీ తనను తాను సనాతన హిందువునని చెప్పుకొన్నా మత సామరస్యతను కోరేవాడు. హిందూ మతానికి తామే సోల్ ఏజెంట్ అని భావించిన వారికి గాంధీజీ ప్రమాదకరంగా కన్పించాడు. గాంధీజీ వర్ణాశ్రమ ధర్మాన్ని నమ్మేవాడు, ఆ విషయం బహిరంగంగానే చెప్పేవాడు. నిజానికి వర్ణాశ్రమ ధర్మం ప్రకారం అయితే గాంధీజీ నాయకత్వానికి పనికి రానివాడు. అలాంటి వ్యక్తి బాలగంగాధర తిలక్ నుండి కాంగ్రెస్ నాయకత్వాన్ని స్వీకరించారు. బ్రాహ్మణాధిపత్యం కోరే వారికి అది సహజంగానే ప్రమాదకరంగా కన్పించేది. పూనాలోని తిలక్ స్మారక మందిరం హిందూ మహాసభ గాంధీజీ వ్యతిరేకులకు అడ్డుగా మారడం కాకతాళీయం కాదు.

/ వ్యాసకర్త 'ప్రజాశక్తి' పూర్వ సంపాదకులు /

అభిప్రాయం

పాపం...గాజా పిల్లలు!

అన్ని యుద్ధాలలో ఎక్కువగా బాధపడేది మహిళలు, పిల్లలే. యుద్ధాలకు కూడా నియమాలు ఉంటాయి. అంతర్జాతీయ మానవతా చట్టం ప్రకారం ఏ ఒక్క చిన్నారి కూడా అవసరమైన సేవలకు, మానవతా దృక్పథానికి దూరం కాకూడదు. సాయుధ పోరాటంలో ఏ చిన్నారినీ బందీగా ఉంచకూడదు. ఏ విధంగానూ వారిని యుద్ధంలో భాగస్వాములను చేయగూడదు. వారిని సైనిక ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదు. ఆసుపత్రులు, పాఠశాలల మీద బాంబు దాడులు చేపట్టకూడదు. అయితే వీటికి విరుద్ధంగా గాజాలో ఇజ్రాయిల్ ప్రవర్తిస్తున్నది. గాజా స్ట్రిప్‌లో పెరుగుతున్న శత్రుత్వాలు పిల్లలు, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. పిల్లలు ప్రమాదకర స్థాయిలో చనిపోతున్నారు. ఇప్పటికే వేలాది మంది మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. గాజా స్ట్రిప్‌లో 19 లక్షలకు పైగా ప్రజలు అంతర్గతంగా వలస బాట పట్టారని అంచనా. వారిలో సగం మంది పిల్లలే. వారికి తగినంత నీరు, ఆహారం, ఇంధనం, మందులు అందుబాటులో లేవు. వారి ఇళ్లు ధ్వంసం అయ్యాయి. వారి కుటుంబాలు చీలిపోయాయి. తల్లులు ప్రసవించే ముందు, ప్రసవ సమయంలో, తరువాత తగిన వైద్య సంరక్షణ, పోషకాహారం, రక్షణను పొందడంలో అనూహ్యమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. స్వచ్ఛమైన నీరు, శుభ్రమైన మరుగుదొడ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచే అవకాశం లేకపోవడంతో గాజాలో హెపటైటిస్-ఎ అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా సమాచారం ప్రకారం సగటున 500 మంది ఒకే మరుగుదొడ్డిని వాడుతున్నారు. 2,000 మందికి పైగా ప్రజలు ఒకే షవర్‌ని ఉపయోగిస్తున్నారు. ఇది వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదాన్ని పెంచుతుంది. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో అతిసార కేసులు విపరీతంగా నమోదయ్యాయి. బలహీనంగా ఉన్న తల్లులు వారి నవజాత శిశువులకు పాలివ్వలేని పరిస్థితి గాజాలో ఉంది. వీరికి పోషకాహార లోపం, ఇతర ఆరోగ్య సమస్యలు అధికం అవుతున్నాయి. తాత్కాలిక ఆశ్రయాలు, పేలవమైన పోషణ, సురక్షితంకాని నీరు వంటి అమానవీయ పరిస్థితులు కనబడుతున్నాయి. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం దాదాపు 25,000 మంది మరణించారు. ఇందులో 70 శాతం మంది మహిళలు, పిల్లలు ఉన్నారు. కనీసం మరో 61,500 మంది గాయపడ్డారు. పాలస్తీనాలోని పిల్లల భద్రత, సంరక్షణ కోసం యునిసెఫ్ పిలుపునిస్తోంది. తక్షణ, దీర్ఘకాలిక మానవతావాద కాల్పుల విరమణ ప్రకటించాలి. అపహరణకు గురైన పిల్లలందరినీ తక్షణం షరతులు లేకుండా విడుదల చేయాలి. గాజాలో పిల్లలు అత్యవసర వైద్యాన్ని, ఆరోగ్య సేవలను పొందే అవకాశం కలిగించాలి.

- జనక మోహన రావు దుంగ,
అధ్యాపకుడు, శ్రీకాకుళం, సెల్: 8247045230

ఐకెఎస్ హెల్త్ సంస్థతో గీతం ఎంఒయు

ప్రజాశక్తి -మధురవాడ (విశాఖ)

ఆరోగ్య సేవారంగంలో పేరొందిన అమెరికన్ ఐకెఎస్ హెల్త్ కేర్ సంస్థ బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది, గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఐకెఎస్ హెల్త్ కేర్ సంస్థ ఉపాధ్యక్షురాలు డాక్టర్ హరిప్రీత్‌కౌర్ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. రెండు సంస్థలు మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా వైద్యరంగంలో ముఖ్యంగా ఫిజియోథెరపి, దంతవైద్యం, పారామెడికల్ విభాగాలలో యువతకు మార్గదర్శకం చేయడంతోపాటు అమెరికన్ వైద్య నిపుణుల సూచనలు, సలహాలు అందిసూ వృత్తి నైపుణ్యాలను పెంచడంలో క్రియాశీల పాత్ర పోషిస్తారు. అలాగే సంయుక్త పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించడం, విశ్వవిద్యాలయంలో పరిశోధకులకు మార్గదర్శకం వహించడం, గీతం అధ్యాపకులకువ వర్క్‌షాప్, సదస్సుల నిర్వహణలో సహకరించడం, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

గీతం విసి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం మాట్లాడుతూ బోధనతో పాటు పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రూ.100 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని, తద్వారా శాస్త్ర విజ్ఞానంలో దేశం గర్వించ తగ్గ అత్యున్నత పరిశోధనలను నిర్వహించాలనేది తమ లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డిప్యూటీ డైరక్టర్ వంశీకిరణ్ సోమయాజుల, గీతం దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారామరాజు, డాక్టర్ ఉమాదేవి, ఫిజియోథెరిపి డైరక్టర్ డాక్టర్ జి.రంగనాథ్ పాల్గొన్నారు.

మహాకుంభాభిషేకంపై వారంలోగా నిర్ణయం తీసుకోండి

- హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

శ్రీశైలం దేవస్థానంలో మహా కుంభాభిషేకం ఇతర పూజల ముహూర్తాన్ని వారంలోగా నిర్ణయించాలని హైకోర్టు ఆదేశించింది. దేవాదాయశాఖ కమిషనర్, దేవస్థానం ఇఒలకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం కార్యక్రమాలను నిర్వహించేలా ఆదేశాలివ్వాలని సంగాల సాగర్ వేసిన పిల్‌పై విచారణను ఫిబ్రవరి 7కు హైకోర్టు వాయిదా వేసింది.

తిరుమలలో శారాదాపీఠం అక్రమ నిర్మాణాలు

- హైకోర్టులో పిల్‌పై విచారణ

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల కొండపై విశాఖ శారదాపీఠం అక్రమ నిర్మాణాలు చేస్తోందంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. నిర్మాణాలపై పరిశీలన చేసి నివేదిక తెప్పించుకునేందుకు వీలుగా అడ్వకేట్ కమిషన్‌ను హైకోర్టు నియమించింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా.. చర్యలు లేవని దాఖలైన పిల్‌పై విచారణను ఫిబ్రవరి 14కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులిచ్చింది. తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షులు తుమ్మా ఓంకార్ దాఖలు చేసిన పిల్ తరపున న్యాయవాది ఆదిత్య హర్షవర్ధన్ వాదించారు. ఈ నేపథ్యంలో నిర్మాణాలను పరిశీలించేందుకు అడ్వకేట్ కమిషనరును హైకోర్టు నియమించింది.



ఎఇఇ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యుత్ పిఆర్‌సితో ఇంజినీర్లకు నష్టం

- ఎఇఇ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణలో నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగులకు ప్రకటించిన పిఆర్‌సిలో ఇంజినీర్లకు తీవ్రమైన నష్టం జరిగిందని విద్యుత్ ఇంజినీర్ల నాయకులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ విజయవాడలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిబి శ్రీనివాసరావు, ప్రతాపరెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల నియామకాలు చేపట్టాలని కోరారు. నియామకాలు చేపట్టకుండా ఉన్న ఇంజినీర్లపై తీవ్రమైన పని ఒత్తిడిని పెంచుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదని తెలిపారు. నియామకాలను ఉన్న సర్వీస్ నిబంధనల ప్రకారమే జరపాలని డిమాండ్ చేశారు. అన్ని కంపెనీల్లో కెపాసిటీ ఎడిషన్‌కు, కొత్త జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా కొత్త పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అసిసోయేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ దత్, ప్రతాప్, అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లిఖార్జున, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎయు విసికి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

ఆంధ్రా విశ్వవిద్యాలయం విసి పివిజిడి ప్రసాదరెడ్డికి హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. అధికార దుర్వినియోగంపై వివరణ ఇవ్వాలని విసితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్యా మండలి సభ్య కార్యదర్శి, యుజిసి సభ్య కార్యదర్శి, వర్సిటీ రిజిస్ట్రార్లను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశించింది. విసి అధికార దుర్వినియోగంపై విచారణ చేయాలంటూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం కార్యదర్శి రమణ పిల్‌పై తదుపరి విచారణ ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది.

బిఇడి కౌన్సెలింగ్ ఎందుకు చేయలేదు?

- హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ఎడ్‌సెట్ నిర్వహించి ఏడు నెలలు అవుతున్నా.. బిఇడి కౌన్సెలింగ్ చేపట్టకపోవడంపై వవరణ ఇవ్వాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, ఎడ్‌సెట్ కన్వీనర్‌ను హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. కౌన్సెలింగ్ చేపట్టకపోవడాన్ని సవాల్ చేస్తూ పిడిఎస్‌యు నేషనల్ కన్వీనర్ ఎం రామకృష్ణ వేసిన పిల్‌పై విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
రామలింగేశ్వర నగర్ బ్రాంచ్ (3187)
కృష్ణలంక, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520013, ☎ 0866-2491558, 8331015695

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత శ్రీ ప్రొద్దుటూరి చిన్న శ్రీనివాస్ యొక్క చట్టపరమైన వారసులు 1. పి. మేయూన్ (భార్య), 2. పి. చిన్న స్వామి (కుమారుడు)** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ.18,05,449.43 /- (అక్షరాల పద్దెనిమిది లక్షల ఐదు వేల నాలుగు వందల నలభై తొమ్మిది రూపాయలు మరియు నలభై మూడు పైసలు మాత్రమే)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **20.10.2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **20.01.2024వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీతలు, హామీదారులు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్, రామలింగేశ్వర నగర్ బ్రాంచ్** వారికి తేది 19.01.2024 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ.18,71,321.43** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:
కృష్ణా జిల్లా, విజయవాడ పటమట ఎస్ఆర్ఒ, పెనమలూరు, యనమలకుదురు గ్రామ పంచాయితీ, సమీప డి.నెం.24-96, ఆర్.ఎస్.నెం. 5/2 నందు మొత్తం 71.05 చ॥గ॥ లేదా 59.04 చ॥మీ॥ స్థలం మరియు అందులో గ్రౌండ్, 1వ అంతస్తు, 2వ అంతస్తు గల బిల్డింగ్. **హద్దులు:** తూర్పు: షేక్ మస్తాన్ బీ ఆస్తి, దక్షిణం: వేట వెంకటలక్ష్మి ఆస్తి, పడమర : 150 అ॥ వెడల్పు రోడ్డు, ఉత్తరం: పాణెం గలీబ్ సాహిబ్ ఆస్తి.

తేది: 20-01-2024, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

Paper Publication (Substituted Service)
FORM.NO.14
[See Regulation 33(2)]

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(DEPARTMENT OF FINANCIAL SERVICES, MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA)
31-31-21, Narayana Bhavanam, Saibaba Street, Daba Gardens, Visakhapatnam - 530 020

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)
R.P. No.280 of 2023 in OA No.502 of 2020
Union Bank(e-Andhra. Bank), Main Branch, Gudivada, Krishna District
Versus
Mrs. Koneru Sree Rajyalakshmi Vijaya Chamundeswari Devi

To
(CDR 1) Mrs. Koneru Sree Rajyalakshmi Vijaya Chamundeswari Devi, W/o. Sri Koneru Leela Prasad, represented by her General Power of Attorney holder Mr. Kodali Nageswara Rao, Gudivada, Krishna District

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in OA No. 502 of 2020, an amount of **Rs.1,53,75,909/- (Rupees One Crore Fifty Three Lakhs Seventy Five Thousand Nine Hundred and Nine Only)** along with pendentellite and future interest @ 10.20% p.a. compounded with quarterly rests w.e.f **14.09.2020** till realization and the costs has become due against you (Jointly and Severally/Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of your assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **28.11.2023 at 10:30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid, you will be liable to pay :-
(a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken palce for recovering the certificate amount due.

(Given under my hand and the seal of the Tribunal, on, this day 10.10.2023)

Next Hearing Date : 27.02.2024 — (B.N.S.V.S.K.BANGARRAJU) Recovery Officer

Paper Publication (Substituted Service)
FORM.NO.14
[See Regulation 33(2)]

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(DEPARTMENT OF FINANCIAL SERVICES, MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA)
31-31-21, Narayana Bhavanam, Saibaba Street, Daba Gardens, Visakhapatnam - 530 020

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)
R.P. No.1140 of 2018 in OA No.689 of 2014
Union Bank of India (e-Andhra Bank), Gudivada Branch, Krishna District
Versus
Sri Buddha Raju Thagur Verma & another

To
(CDR 1) Sri Buddha Raju Thagur Verma, S/o. B. Krishna Raju, D.No.2-841, Venkatapuram, 4th Block, Komavarapu, Kotha Village, West Godavari District
(CDR 2) Sri Peesipati Naga Anjaya Srinivas, S/o P. Kasi Viswanath, 23-24-9, Sai Towers. BS Street, S Puram, Vijayawada

భారత డబుల్స్ స్పెషలిస్ట్ రోహన్ బొప్పన్న ఓ రికార్డును తన పేర లిఖించుకోవడంతోపాటు ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్‌కు చేరాడు. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో 2వ సీడ్‌గా బరిలోకి దిగిన రోహన్ బొప్పన్న-ఎబ్డెన్(ఆస్ట్రేలియా) జోడీ 6-4, 7-5(7-5)తో 5వ సీడ్ అర్జెంటీనా జంటను చిత్తుచేశారు. దీంతో సెమీస్‌కు చేరడంతో పాటు రోహన్ బొప్పన్న 43ఏళ్ల వయసులో ప్రపంచ ర్యాంకింగ్స్‌లోనూ అగ్రస్థానానికి ఎగబాకాడు. ఈ క్రమంలో అత్యధిక వయసులో టాప్‌ర్యాంక్‌కు చేరిన ఓ టెన్నిస్ ఆటగానిగా భారత్‌కు చెందిన రోహన్ బొప్పన్న రికార్డు పుటల్లోకెక్కాడు. సెమీస్‌లో బొప్పన్న జోడీ జంగ్(చైనా)-మచాక్(చెక్)లతో తలపడనున్నారు.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
గవర్నర్‌పేట బ్రాంచి -01451, డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ - 520002

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(RULE 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ & ఇంటరస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, గవర్నర్‌పేట బ్రాంచి, డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ -520002, యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారము లతో **ఋణగ్రహీత : శ్రీ బేల్ సుబ్రహ్మణ్యం,** తండ్రి : బేల్ రాజబాబు వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 25,07,094/- (అక్షరాలా ఇరవై ఐదు లక్షల ఏడు వేల తొంభై నాలుగు రూపాయలు మాత్రమే)** + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేది. 29-06-2023న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 8 ప్రకారము **తేది. 20-01-2024** న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవిలు జరుపరాదని, ఎటువంటి లావాదేవిలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట ఇఎబి బ్రాంచి వారికి చెల్లించవలసిన బకాయి **రూ. 25,07,094/- (అక్షరాలా ఇరవై ఐదు లక్షల ఏడు వేల తొంభై నాలుగు రూపాయలు మాత్రమే)** + వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జీకి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు / హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుభందమైన సబ్ సెక్షన్ (8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, యనమలకుదురు, అవనిగడ్డ రోడ్డు, చీతల కట్ట, యం.వి.ఆర్. టవర్స్ మరియు హెచ్.పి. గ్యాస్ గోడౌన్ లకు దగ్గర, దగ్గరి డోర్ నెం. 24-4, ఆర్.ఎస్.నెం. 123/2 వద్ద 89 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఆస్తి. **హద్దులు : తూర్పు :** 24 అ॥ వెడల్పు పంచాయితీ రోడ్డు, **దక్షిణం :** కోతింటి గోపి గారి ఆస్తి, **పడమర :** కార్యనిర్వాహకుని ఆస్తి, **ఉత్తరం :** పిడుగు నాగరాజు గారి ఆస్తి.

తేది : 20-01-2024 స్థలం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
నందిగామ బ్రాంచి (03941) నందిగామ, ఎన్.టి.ఆర్. జిల్లా.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ ఆబ్లిగెంట్ (లు) : 1) మెస్సర్స్ శ్రీ గణేష్ ఏజెన్సీస్, రిజిస్టర్డ్ / అడ్మిన్ ఆఫీస్ : 3-115, పాత విజిటెబుల్ మార్కెట్ రోడ్డు, ముక్త్యాల మెయిన్ రోడ్డు, జగ్గయ్యపేట, కృష్ణా జిల్లా, ఎపి-521175. **2) శ్రీ గుండ సాంభశివరావు,** మేనేజింగ్ పార్టనర్, మెస్సర్స్ గణేష్ ఏజెన్సీస్, పాత విజిటెబుల్ మార్కెట్ రోడ్డు, ముక్త్యాల మెయిన్ రోడ్డు, జగ్గయ్యపేట, కృష్ణా జిల్లా, ఎపి - 521175. **3) శ్రీ గుండ రమేష్,** పార్టనర్, మెస్సర్స్ గణేష్ ఏజెన్సీస్, పాత విజిటెబుల్ మార్కెట్ రోడ్డు, ముక్త్యాల మెయిన్ రోడ్డు, జగ్గయ్యపేట, కృష్ణా జిల్లా, ఎపి - 521175.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, (యాక్టు 54 యొక్క 2002) ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియావారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 22-05-2023** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 11-08-2023న** అధీకృత అధికారి స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది.

కాబట్టి, ఆస్తుల లావాదేవీలు చేస్తున్న లేదా ఇతరాత్ర ఇట్టి ఆస్తులు కొనుగోలు పట్ల ఆసక్తి గల వ్యక్తులు నుండి కొటేషన్లు పొందుట లేదా (బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా (సి) బహిరంగ వేలం నిర్వహించుట ద్వారా లేదా (డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా బ్యాంక్ ఆమోదయోగ్యమైన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేదీ నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 22-05-2023** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

1) గుండ సాంబశివరావు గారి పేరిట కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట, పాత విజిటెబుల్ మార్కెట్, డి.నెం. 12-241/1 వద్ద 64.00 చ॥గ॥ల విస్తీర్ణంలోని భూమి మరియు అందలి నివాస భవనం. **హద్దులు : తూర్పు :** జాయింట్ కాంపౌండ్ వాల్, శ్రీమతి ఎన్. లక్ష్మీ కాంతమ్మ గారి ఇల్లు, **దక్షిణం :** రాజవీధి / వీధి, **పడమర :** జాయింట్ కాంపౌండ్ గోడ, శ్రీ ఎన్. సత్యనారాయణ గారి ఇల్లు, **ఉత్తరం :** శ్రీ కురివిల్లు మారుతి వాసుదేవరావు గారి షాపు.

రిజర్వు ధర : రూ. 22,27,000/- ఇ.ఎమ్.డి. : రూ. 2,22,700/-

2) గుండ సాంబశివరావు గారి పేరిట కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట, పాత విజిటెబుల్ మార్కెట్, డి.నెం. 12-241/1 వద్ద 14.77 చ॥గ॥ల విస్తీర్ణంలోని భూమి మరియు అందలి కమర్షియల్ షాపు. **హద్దులు : తూర్పు :** జాయింట్ కాంపౌండ్ వాల్, శ్రీ జనిమియా & శ్రీ నాగుల్‌మీరా గార్ల షాపు, **దక్షిణం :** రోడ్డు / బజారు, **పడమర :** జాయింట్ కాంపౌండ్ గోడ, ఇల్లు, శ్రీ షేక్ ఆలీసాహెబ్ గారి షాపు, **ఉత్తరం :** జాయింట్ కాంపౌండ్ గోడ, శ్రీ భోజనపల్లి మోహన్‌రావు గారి షాపు.

రిజర్వు ధర : రూ. 10,29,000/- ఇ.ఎమ్.డి. : రూ. 1,02,900/-

తేది : 12-12-2023 ప్రదేశం : నందిగామ
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

తృణమూల్, వామపక్షాలు కలిసే పరిస్థితే లేదు !

• రాష్ట్రాల స్థాయిలోనే సీట్ల సద్దుబాటు జరగాల్సి వుంది • రోజువారీ సమస్యలే ఎన్నికల్లో ప్రభావం చూపిస్తాయి • పత్రికా ఇంటర్వ్యూలో సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తు వుండబోదని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. బుధవారం ది హిందూ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇండియా వేదిక భాగస్వాముల మధ్య జరుగుతున్న చర్చలు, వామపక్షాల వైఖరి వంటి అంశాల గురించి ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. సంఘటితమవుతున్న హిందూత్వ శక్తులను ప్రతిపక్షాలు ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరముందన్నారు. ఆ ఇంటర్వ్యూ విశేషాలు..



పశ్చిమ బెంగాల్‌లో సీట్ల సద్దుబాటు చర్చల పరిస్థితి ఏమిటి ?

ప్రజాస్వామ్య రక్షణ కోసం, భారతదేశ లౌకిక ప్రజాతంత్ర స్వభావ పరిరక్షణ కోసం మేం కృషి చేస్తామని ఎప్పుడూ చెబుతూనే వస్తున్నాం. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మాది అదే వైఖరి. పశ్చిమ బెంగాల్‌కు కూడా ఇది వర్తిస్తుంది. పశ్చిమ బెంగాల్‌లో, గత అసెంబ్లీ ఎన్నికల్లో, బిజెపి, తృణమూల్ కాంగ్రెస్‌లను ఓడించేందుకు కాంగ్రెస్, ఇతర లౌకిక మిత్రపక్షాలతో కలిసి పనిచేయడం ద్వారా గరిష్టంగా ఓట్లను గెలుచుకోవడానికి మేం కృషి చేశాం. తృణమూల్ కాంగ్రెస్ చాలా దూకుడుగా వ్యవహరిస్తోంది. మమతా బెనర్జీ మమ్మల్ని తీవ్రవాద సంస్థ అని నిందించారు. ఇంకా చాలా మాటలు మాట్లాడారు. ఇప్పుడు వాటికి సంబంధించిన చర్చలోకి వెళ్లాలనుకోవడం లేదు. వారెలాంటి వైఖరి తీసుకుంటారో అది వారిష్టం. కానీ మా వైఖరి స్పష్టం. బెంగాల్ యువత కూడా పెద్ద ఎత్తున స్పందిస్తుందని భావిస్తున్నా. జనవరి 8న జరిగిన బ్రిగేడ్ పరేడ్ ర్యాలీ కూడా మా అంచనాలకు మించి జరిగింది.

అంటే ఇక పొత్తుకు 'నో' అని చెబుతారా ?

తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పని చేసే పరిస్థితే వుండబోదని అనిపిస్తోంది. దీనివల్ల బిజెపి మాత్రమే లాభపడుతుందని కూడా మేం భావిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పట్ల నెలకొన్న వ్యతిరేకత కూడా బిజెపికి లాభించనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తలెత్తిన హింసను పరిగణనలోకి తీసుకుంటే, బెంగాల్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తృణమూల్ కాంగ్రెస్‌ను కూడా ఓడించాల్సి వుంది.

రామ మందిరం ప్రారంభంతో నెలకొన్న హర్షాతిరేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే ప్రతిపక్షాలు 2024 ఎన్నికల ప్రచారాన్ని కొంత ప్రతికూలతతో ప్రారంభిస్తున్నాయని మీరు భావిస్తున్నారా ?

ఇది ఊహించిందే. దీన్ని ఎన్నికలకు పెద్ద ఎత్తున వాడుకోవాలని వారు కోరుకుంటున్నారు. ఇది కేవలం మా నిర్ధారణ మాత్రమే కాదు, శంకరాచార్యులు కూడా మందిరం ప్రారంభోత్సవానికి ఎంచుకున్న సమయాన్ని ప్రశ్నించారు. సగం నిర్మాణం మాత్రమే పూర్తయిన ఆలయంలో ప్రాణ ప్రతిష్ట ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు.

మీరు దీన్ని ఎలా ప్రతిఘటిస్తారు ?

ఇది హిందూత్వను సంఘటితం చేయడమే, గత దఫా అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా మీరు చూశారు. దీన్ని ఎలా ఎదుర్కొనాలన్న విషయమై మేం చాలా స్పష్టంగా వున్నాం. ఇండియా పక్షాలకూ ఈ అంశంపై ఒక ఉమ్మడి అవగాహన వుంది. ప్రజల రోజువారీ జీవనోపాధి అంశాలే అత్యంత ముఖ్యమైన అంశాలుగా ఆవిర్భవిస్తాయి. ఈ రామ మందిరం అంశం భావోద్వేగాలతో కూడినదై వుండవచ్చు. అయినా, ప్రజలకు తమకు నచ్చిన విశ్వాసాన్ని ఎంచుకునే హక్కు వుంది. ఆ హక్కును కాపాడేందుకు మేం కృషి చేస్తున్నాం. అయితే, ప్రస్తుత జీవన పరిస్థితులు ఏమిటన్నది ఇక్కడ ప్రశ్నగా వుంది. గత అర్ధ శతాబ్దంలో అత్యధిక స్థాయిలో నిరుద్యోగం నెలకొన్న పరిస్థితుల్లో మనం జీవిస్తున్నాం. అడ్డూ అదుపు లేని ధరల పెరుగుదల, సరైన ఉద్యోగాలు లేక స్వస్థలాలకు మళ్ళుతున్న వైనం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. బతుకు సాగించడం కోసం నగరాలకు వెళ్ళిన ప్రజలు తిరిగి గ్రామాలకు మళ్ళడమనేది అరిష్టానికి సంకేతం. ఇటువంటి పరిస్థితుల్లో, గ్రామీణ నిరుపేదలకు ఏకైక జీవనాడిగా వున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఇజిఎ)పై వరుసగా దాడి జరుగుతునే వుంది.

మీరు చెప్పింది నిజమైనట్టైతే, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయాన్ని మీరెలా చూస్తారు?

ఆ మూడు రాష్ట్రాలు, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌ల్లో బిజెపిపై పోటీ చేసిన కాంగ్రెస్ తన ఓట్లను నిలబెట్టుకుంది. బిజెపి పొందిన అదనపు ఓట్ల గురించి ఇక్కడ ప్రశ్నించుకుంటే అది హిందూత్వ సంఘటితమే. అయితే,, కర్ణాటక, తెలంగాణా, హిమాచల్ ప్రదేశ్‌ల్లో బిజెపి ఓడిపోయింది. భారతదేశ ఓటర్లందరూ ఒకే దారిలో వెళుతున్నట్లైతే ఇది జరగదు. హిందూత్వ ఏకీకరణకు, దాన్ని వ్యతిరేకించడానికి మధ్య కొంత తేడా వుందన్నది వాస్తవం.

గతేడాది జూన్ 23న ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక్కతాటిపైకి వచ్చాయి. ఏడు మాసాలైంది, ఇప్పటివరకు ఇండియా భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సద్దుబాటు ఒప్పందం జరగలేదు. ఇప్పటికే ఆలస్యమవలేదంటారా ?

చర్చలు జరుగుతున్నాయి. ఇండియా పక్షాల మధ్య ఏం ఒప్పందం కుదిరింది ? రాష్ట్ర స్థాయిలో సీట్ల విభజన ఖరారై, ఆమోద ముద్ర పొందాల్సి వుంది. ప్రతి రాష్ట్రంలో భిన్నమైన రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదాహరణకు కేరళనే తీసుకుంటే, అక్కడ, సిపిఎం నేతృత్వంలోని వామపక్ష ప్రజాతంత్ర సంఘటనకు, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్‌కు మధ్య ప్రత్యక్షంగా పోటీ నెలకొంది. ఇక అక్కడ ఏ రకరమైన సీట్ల విభజన గురించి మాట్లాడాల్సి వుంటుంది? ఈ రెండు ఫ్రంట్‌ల మధ్య ముఖాముఖి పోటీ వున్నందున అక్కడ బిజెపి ఒక్క అసెంబ్లీ సీటు కూడా గెలిచే పరిస్థితి వుండదు. మహారాష్ట్రలో మహారాష్ట్ర వికాస్ అగాధి, బీహార్‌లో మహాఘట్‌బంధన్, తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని సెక్యులర్ ఫ్రంట్ వున్నాయి. కాబట్టి ప్రతి రాష్ట్రంలోనూ ఈ చర్చలు ఇప్పటికే సాగుతున్నాయి. ఈ నెలాఖరుకల్లా పరిస్థితులన్నీ ఒక కొలిక్కి వస్తాయని కచ్చితంగా చెప్పగలను.

అయితే, పంజాబ్, ఉత్తరప్రదేశ్, అలాగే పశ్చిమ బెంగాల్ వంటి కొన్ని సమస్యాత్మక రాష్ట్రాల గురించి ?

పశ్చిమ బెంగాల్ గురించి ఇప్పటికే చెప్పాను. అలాగే పంజాబ్‌కి సంబంధించి కూడా అక్కడ అలాంటి పరిస్థితులే వున్నాయి. అక్కడ అందరూ ఒక్కతాటిపైకి వస్తే, అప్పుడు ప్రభుత్వ వ్యతిరేకత ప్రతిపక్షానికి (అకాలీదళ్, బిజెపి) మాత్రమే సాయపడుతుంది. కాబట్టి, రాష్ట్రంలో పరిస్థితిని నిర్దిష్టంగా, సమగ్రంగా అంచనా వేయాలి. యుపిలో కూడా ప్రధాన పార్టీల మధ్య చర్చలు ఇప్పటికే సాగుతున్నాయి.

భారత్ జోడో యాత్రలో మీరు చేరతారా ?

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఇద్దరూ నన్ను ఆహ్వానించారు. ఎక్కడ, ఎప్పుడు ఆ యాత్రలో పాలు పంచుకోగలమో ఇంకా చూడాల్సి వుంది.

'ఇండియ' ఫోరం భాగస్వామ్య పక్షాలు ఇంకా సంయుక్త ర్యాలీ లేదా బహిరంగ సభ నిర్వహించాల్సి వుంది. మరి అది కూడా ఆలస్యమవలేదా ?

మనం వరుసగా బహిరంగ సభలు నిర్వహించాల్సిన అవసరం వుందని, రాష్ట్ర స్థాయిలో సీట్ల సద్దుబాటు చేసుకోవాల్సి వుందని, ఆ ప్రాతిపదికనే మన దార్శనికతను ప్రకటించాల్సి వుందని ఇండియా ఫోరం మొట్టమొదటి సమావేశం నుండి నేను చెబుతూనే వస్తున్నాను. కానీ ఇంతవరకు ఇది జరగలేదు. అయితే, ఫిబ్రవరికల్లా ఈ క్రమం మేం ప్రారంభించగలమని భావిస్తున్నాను.

అవినీతి రహిత రాష్ట్రమే మా లక్ష్యం : పినరయి విజయన్

తిరువనంతపురం : దేశంలో అవినీతి అతి తక్కువగా జరుగుతున్న రాష్ట్రంగా కేరళ నిలవడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పందించారు. ఈ రికార్డు సాధించినందుకు తాను, తన మంత్రిమండలి సహచరులు, వామపక్ష కూటమి తలెత్తుకొని నిలబడగలిగామని ఆయన వ్యాఖ్యానించారు. అయితే దీనిపై తాము సంతృప్తి చెందడం లేదని, కేరళను పూర్తిగా అవినీతి రహిత రాష్ట్రంగా మార్చడమే తమ లక్ష్యమని తెలిపారు. కొన్ని ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా కేరళలోని ప్రభుత్వ శాఖలు కానీ, సంస్థలు కానీ పనులు లేదా ప్రాజెక్టులు పూర్తి చేసినందుకు ఎవరి నుండి కమీషన్లు తీసుకోవని పినరయి చెప్పారు. 'అందుకే మేము తల ఎత్తుకొని నిలబడ్డాం. అందుకే అవినీతి విషయంలో ఎవరి ముందూ తల దించాల్సిన అవసరం రాలేదు. అది మా మంత్రిమండలి, లెఫ్ట్ ఫ్రంట్ ఘనత' అని బుధవారం జరిగిన రెవెన్యూ భవన్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన తెలిపారు. మనశ్శాంతి కోల్పోవడానికి ధనదాహమే ప్రధాన కారణమని పినరయి విజయన్ అన్నారు.

అమెజాన్‌కు ఫ్రాన్స్ షాక్

పారిస్ : ఉద్యోగులపై మితిమీరిన నిఘా ఉంచిందనే ఆరోపణలపై అమెజాన్‌కు ఫ్రాన్స్ డేటా ప్రొటెక్షన్ ఏజెన్సీ భారీ జరిమానా విధించింది. 32 మిలియన్ యూరోలు (సుమారు రూ.290 కోట్లు) చెల్లించాలని ఆదేశించింది. యూరోపియన్ యూనియన్ జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ ప్రకారం ఉద్యోగుల వ్యక్తిగత డేటా సేకరణ, వినియోగంపై అక్కడి రెగ్యులేటరీల అనుమతి తప్పనిసరి. నిబంధనలకు విరుద్ధంగా అమెజాన్ డేటాను సేకరించినట్లు దర్యాప్తులో తేలడంతో జరిమానా విధించింది. ఫ్రాన్స్‌లో అమెజాన్‌కు దాదాపు 20 వేల మంది పని చేస్తున్నారు.

గ్రామీణ బంద్‌కు మద్దతు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను తొలగించాలని, ఆయనపై హత్య కేసు నమోదు చేయాలని, సమగ్ర రుణమాఫీ చేయాలని, కార్మికులకు నెలకు రూ. 26 వేలు కనీస వేతనం ఇవ్వాలని. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని. ప్రాథమిక హక్కుగా ఉపాధి హామీని చేయాలని, . పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, రైల్వే, రక్షణ, విద్యుత్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని,. ఉద్యోగాల్లో కాంట్రాక్టీకరణ రద్దు చేయాలని, ఒక వ్యక్తికి రోజుకు రూ. 600 వేతనంతో ఏడాదికి 200 రోజుల పనితో ఉపాధి హామీని బలోపేతం చేయాలని. సంఘటిత, అసంఘటిత ఆర్థిక వ్యవస్థలో అందరికీ పెన్షన్ , సామాజిక భద్రత కల్పించాలని, కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లో సెక్షన్ 104 రద్దు చేయాలని, భూసేకరణ పరిహారం, పునరావాసం (ఎల్ఎఆర్ఆర్) చట్టం-2013 అమలు చేయాలని ఆ ఉమ్మడి ప్రకటన డిమాండ్ చేసింది. ఈ డిమాండ్లు సాధించేవరకు ఉమ్మడి పోరాటం కొనసాగుతుందని అది స్పష్టం చేసింది.

రైతులు నో చెప్పినా నానో

(మొదటి పేజీ తరువాయి)

శాస్త్రీయంగా నిరూపణ కాలేదని ప్రతిష్టాత్మక కొపెన్ హగెన్ యూనివర్శిటీకి చెందిన సైంటిస్టులు ఇటీవల పరిశోధనా పత్రాలు ప్రకటించారు. రైతులు నానో యూరియాను తిరస్కరిస్తున్నారు. అయినప్పటికీ నానో డిఎపిని కూడా కేంద్రం ప్రవేశపెట్టింది. ఇదంతా ఎరువుల సబ్సిడీని తగ్గించుకోవడానికేనని పిఎం ప్రణామ్‌లో స్పష్టం చేసింది. శాస్త్రీయం కాని నానో ఎరువులను రైతులు వద్దన్నా అంటగడుతోంది. మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం మాట జవదాటకుండా ఆర్‌బికెలలో అమ్మిస్తోంది.

ఎన్ని కేసులైనా పెట్టుకోండి.. నన్ను భయపెట్టలేరు

• అసోం యాత్రలో రాహుల్

గౌహతి : తనపై ఎన్ని కేసులైనా పెట్టుకోవచ్చునని, బీజేపీ-ఆర్ఎస్ఎస్ తనను భయపెట్టలేవని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. అసోంలోని బార్‌పేటలో ఆయన బుధవారం భారత్ జోడో న్యాయ్ యాత్రను ప్రారంభించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసులకు మధ్య మంగళవారం ఘర్షణలు చెలరేగిన నేపథ్యంలో రాహుల్, ఇతర పార్టీ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన మండిపడుతూ కేసులతో తనను భయపెట్టలేరని అన్నారు. 'కేసుల ద్వారా నన్ను భయపెట్టవచ్చునని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఎలా అనుకుంటున్నారో నాకు తెలియదు. మరో పాతిక కేసులు పెట్టుకోండి. నేనేమీ భయపడను' అని చెప్పారు. అసోం భాష, సంస్కృతి, చరిత్రను తుడిచివేయాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుకుంటున్నాయని ఆరోపించారు. అసోంను నాగపూర్ నుండి నడపాలని వారు భావిస్తున్నారని, కానీ తాము అందుకు అనుమతించబోమని చెప్పారు. ప్రజల జేబులు కొల్లగొట్టడంలో బిశ్వ శర్మ అందెవేసిన చేయి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



తాను విద్వేషాలను రెచ్చగొడుతున్నానంటూ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణను ప్రస్తావిస్తూ 'రోజుకు 24 గంటలూ ఆ పని చేస్తోంది ఆయనే. మీరు పత్రికలు, టీవీ చూస్తుంటే వాటి వెనుక ఆయనే ఉంటారు. ఆయన ఏం చెబితే అదే మీడియా మీకు చెబుతుంది. దేశంలో అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది బిశ్వ శర్మే. అసోం ముఖ్యమంత్రి రిమోట్ అమిత్ షా చేతిలో ఉంది. ఒకవేళ అమిత్ షాకు వ్యతిరేకంగా ఆయన ఏదైనా మాట్లాడితే రెండు నిమిషాలలోనే పార్టీ నుండి బయటికి గెంటేస్తారు' అని చెప్పారు.

హింస, కవ్వింపు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం, పోలీసు సిబ్బందిపై దాడి వంటి చర్యలకు పాల్పడిన రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కన్హయ కుమార్ తదితరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ముఖ్యమంత్రి బిశ్వ శర్మ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలియజేశారు. కుట్రకు పాల్పడడం, చట్టవిరుద్ధంగా సమావేశం కావడం, అల్లర్లకు దిగడం వంటి నేరాలకు సంబంధించి ఐపీసీలోని పలు సెక్షన్ల కింద వారిపై కేసులు పెట్టారు.

రాహుల్ భద్రతపై ఆందోళన : అమిత్ షాకు ఖర్గే లేఖ

అసోంలో రాహుల్ గాంధీ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. అసోంలో భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా రాహుల్ కు భద్రత కల్పించడంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, అనేక భద్రతా లోపాలు వెలుగుచూశాయని ఖర్గే విమర్శించారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఘటనలను తన లేఖలో ప్రస్తావించారు. ముఖ్యంగా ఈ నెల 22న నాగావ్ జిల్లాలో రాహుల్ గాంధీ కాన్వాయ్‌ను బిజెపి కార్యకర్తలు అడ్డుకున్నారని, వారు రాహుల్ గాంధీకి అత్యంత సమీపానికి వచ్చారని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఓ జాతీయ స్థాయి నేత కాన్వాయ్ లోకి ఇతరులు చొరబడి సమీపానికి రావడం అత్యంత అభద్రతో కూడిన పరిస్థితి అని వివరించారు. ఇంత జరుగుతున్నా అసోం పోలీసులు ప్రేక్షకుల్లా చూస్తూ ఉన్నారని, కొన్నిసార్లు పోలీసులే దగ్గరుండి బిజెపి కార్యకర్తలను కాన్వాయ్ లోకి పంపించారని ఖర్గే ఆరోపించారు. ఇప్పటివరకు అసోం పోలీసులు ఎవరినీ అరెస్ట్ చేయకపోవడం శోచనీయం అని పేర్కొన్నారు. రాహుల్ యాత్ర ముందుకు సాగేకొద్దీ ముప్పు అధికమవుతోందని, ఇకనైనా మీరు జోక్యం చేసుకోవాలని అమిత్ షాను కోరారు. రాహుల్ యాత్రకు తగిన భద్రత కల్పించేలా అసోం ముఖ్యమంత్రి, డీజీపీలకు దిశానిర్దేశం చేయాలని ఖర్గే తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

16న దేశవ్యాప్త రోడ్డు రవాణా సమ్మె

• కేంద్ర చట్టాలను నిరసిస్తూ కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) 2023లోని కఠినమైన నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా ఒకరోజు నిరసన సమ్మె చేయాలని దేశంలోని రోడ్డు రవాణా కార్మికులకు ఆలిండియా రోడ్డు రవాణ కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపు ఇచ్చింది. ఈ మేరకు ఆర్.లక్ష్మయ్య (ఎఐఆర్టిడబ్ల్యుఈ), నిర్మల్‌సింగ్ ధాలివాల్ (ఎన్ఎఫ్ఐఆర్టిడబ్ల్యు), ఉమేష్ కుమార్ (ఐఎన్ఎప్టిడబ్ల్యు), హనుమంత్ టేట్ (ఎంకెఎస్), చార్లెస్ గెరోజ్ (టియుసిఐ), తిరుమలస్వామి (టిఎస్టిసిఎస్ఎఫ్), షణ్ముగం (ఎల్పిఎఫ్), ఎస్ కె రాయ్ (ఎఐఎంటిడబ్ల్యుఎఫ్) సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశంల్లో అసంఘటిత రోడ్డు రవాణా కార్మికుల కోసం సామాజిక భద్రతా చట్టాన్ని రూపొందించాలని, కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాల కారణంగా తీవ్రమైన సంక్షోభంలో ఉన్న రోడ్డు రవాణా రంగాన్ని రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 16న సమ్మెలో రోడ్డు రవాణా రంగంలో పనిచేస్తున్న ఇతర సంఘాలన్నీ సమ్మెలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. 'ఎంవి చట్ట సవరణ-2019తో ప్రస్తుతం ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేస్తుంది. మొత్తం రోడ్డు రవాణా రంగాన్ని బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం లక్ష్యంగా పెట్టుకుంది" అని విమర్శించారు. "నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను యజమానులకు బానిసలను చేస్తాయి. నిత్యావసర వస్తువుల ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. కొత్త విద్యుత్ బిల్లు, స్మార్ట్ మీటర్ల ప్రవేశం వల్ల ప్రజలపై పెనుభారం పడనుంది. నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ (ఎన్ఎంపి) ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం తప్ప మరొకటి కాదు. నిరుద్యోగం గరిష్ట స్థాయికి చేరుకుంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ క్రూరమైన విధానాలన్నీ రోడ్డు రవాణా రంగాన్ని, కార్మికులను ప్రభావితం చేస్తున్నాయి" అని విమర్శించారు. ఈ విధానాలను ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ విధానాలను అనుమతించబోమని ప్రభుత్వానికి హెచ్చరించాలి. ఈ నేపథ్యంలో, ఫిబ్రవరి 16న జరిగే సమ్మెలో రోడ్డు రవాణా కార్మికులందరూ పాల్గొనవలసిందిగా మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం" అని పేర్కొన్నారు.


కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా
అర్జెంటీనాలో దేశవ్యాప్త సమ్మె

బ్యూనస్ ఎయిర్స్ : అర్జెంటీనా అధ్యక్షులు జేవియర్ మిలీ తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. కార్మికులు ఒక్క అడుగు కూడా వెనక్కి వేయడం లేదు. ఇందులో భాగంగా బుధవారం దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించారు. లక్షలాది మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. కొత్త చట్టాలను తిరస్కరిస్తూ కార్మికులు, ప్రజలు వీధుల్లోకి వచ్చారు.

సమ్మెలో భాగంగా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌తో పాటు కార్డోబా, రోసారియో, శాన్ మిగ్యుల్ డి టుకుమాన్, మెన్డోజా, మార్ డెల్ ప్లాటా, బహియా బ్లాంకా వంటి పట్టణాల్లోనూ ర్యాలీలు, ప్రదర్శన నిర్వహించారు. బుధవారం సమ్మె కారణంగా నిత్యావసర సేవలకు అంతరాయం కలగనప్పటికీ, ఆర్థిక వ్యవస్థ, రోజువారీ సాధారణ జీవితం స్థంభించిపోయింది. జేవియర్ మిలీ గత నెలలోనే అర్జెంటీనా అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ చాలా వేగంగా కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకుని వచ్చారు. కార్మికుల హక్కులపై దాడి చేయడం, కఠినమైన ఆర్థిక నయా ఉదారవాద చర్యలను విధించడం, దేశ సార్వభౌమాధికారానికి ముప్పు వాటిల్లే ఈ విధంగా ఉన్న చట్టాలను ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తున్నారు.

ప్రస్తుత భౌగోళిక రాజకీయ వాస్తవాలు భద్రతామండలిలో ప్రతిబింబించడం లేదు

• మండలి అధ్యక్షులు డెన్నిస్ ఫ్రాన్సిస్



న్యూఢిల్లీ : ప్రస్తుత భౌగోళిక రాజకీయ వాస్తవాలు ఐరాస భద్రతా మండలిలో ప్రతిబింబించడం లేదని మండలి అధ్యక్షులు డెన్నిస్ ఫ్రాన్సిస్ అంగీకరించారు. అలాగే భద్రతా మండలిలో సంస్కరణలు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయని కూడా ఫ్రాన్సిస్ అంగీకరించారు. ప్రస్తుతం ఐదు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌లో ఫ్రాన్సిస్ పర్యటిస్తున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆహ్వానం మేరకు సోమవారం ఫ్రాన్సిస్ భారత్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా భద్రతా మండలి నిర్మాణం, సంస్కరణలు గురించి ఫ్రాన్సిస్ మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ శాంతిభద్రతలను బలోపేతం చేయడానికి, మద్దతు ఇవ్వడానికి అవసరమైన నిర్ణయాలను మండలి తీసుకోలేకపోయిందని అన్నారు. అయితే మండలిలో సంస్కరణల కోసం భారత్ చేస్తున్న కృషిని ఫ్రాన్సిస్ ప్రశంసించారు. ఐరాస మిషన్ల కోసం 2,50,000 కంటే ఎక్కువ మంది సైనికులను భారత్ అందించిందని గుర్తు చేశారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. హిందూమతంలో ఉన్న అసమానతలు, వివక్ష, దళితులు, మైనార్టీల అణచివేత, బలహీనవర్గాలను తక్కువ చేయడం వంటి సమస్యలను పరిష్కరించకుండా కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీలను కాపాడేందుకు మతాన్ని సాధనంగా వాడుకుంటున్నారని అన్నారు. ఇంతగా విద్వేషాలు పెంచుతూ కుట్రలు చేస్తున్నా రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు నోరెత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం జగన్ మోడీ సేవలో మునిగి తేలుతుంటే, మోడీ దృష్టిలో పడేందుకు చంద్రబాబు తహతహలాడుతున్నారని విమర్శించారు. కేంద్రం ఆహ్వానం మేరకు అయోధ్య వెళ్లిన చంద్రబాబుకు అక్కడ అవమానం ఎదురైందని తెలిపారు. దేశంలో చక్రం తిప్పానని చెప్పుకునే బాబు ఇనుప బారికేడ్ల ముందు మోడీ నిలబడితే లేచి నిలబడి నమస్కారం చేస్తూ ఆయన దృష్టిలో పడేందుకు ప్రయత్నించారని, ఇంతకంటే అవమానం మరొకటి లేదని తెలిపారు. జగన్, బాబు, పవన్ ముగ్గురూ తెలుగు ప్రజలు తలదించుకునేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకునేందుకు అందరికీ హక్కు ఉందని, కానీ మోడీ సర్వోన్నతుడు, భగవంతుడు మాదిరి ఆయన ముందు నిలబడి నమస్కారం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

ఇప్పటికే విహెచ్‌పి, ఆర్ఎస్ఎస్ అనుకూల సన్యాసులు మోడీని భగవంతుడిగా ప్రచారం చేస్తున్నారని, ఇంతగా ఎందుకు దిగజారిపోతున్నారో అర్థం కావడం లేదని అన్నారు. మతాన్ని నెత్తినెత్తుకున్న మోడీకి లొంగిపోయిన వైసిపి, టిడిపి నాయకులు దళితులు, మహిళలు మైనార్టీలకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మన రాష్ట్రంలోనూ భావోద్వేగాలు రెచ్చగొట్టేందుకు ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తుంటే ప్రభుత్వం మన్నుతిన్న పాములా ఉందని, ఎదుర్కొనే ప్రయత్నం చేయడం లేదని అన్నారు. దీన్ని ప్రజలే ప్రశ్నించాలని కోరారు. బిజెపికి లొంగిపోవడంపై వైసిపి నాయకులను వారి పార్టీ కార్యకర్తలు ప్రశ్నించాలని కోరారు.

ఎమ్మెల్యేను ఐప్యాక్‌మార్చడం ఏమిటి

ఎమ్మెల్యే అభ్యర్థులను ఐప్యాక్ ట్రాన్స్‌ఫర్లు చేయడం ఏమిటని శ్రీనివాసరావు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యదేశంలో ఇలాంటి కార్పొరేట్ వ్యూహకర్తల కంపెనీలను, ఎన్నికల బాండ్లను నిషేధించాలని కోరారు. ఎన్నికలు స్వేచ్ఛగా ప్రజాస్వామ్యయుతంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ప్రజల్లో నుండి నాయకులు రావాలని, కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు నాయకులను నియమించడం నియంతృత్వమని పేర్కొన్నారు.

రైతులకు బిజెపి ద్రోహం

• లక్ష కోట్లు నిధులు వెనక్కి పంపిన కేంద్ర వ్యవసాయ శాఖ : ఎస్‌కెఎం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రూ. లక్ష కోట్ల నిధులను వెనక్కి (సరెండర్) పంపినందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖపై సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ధ్వజమెత్తింది. బిజెపిని 'శిక్షించాలి' అని ప్రజలకు పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మంత్రిత్వ శాఖకు కేటాయించిన నిధులను సరెండర్ చేయడంతో రైతులకు ద్రోహం చేసిందని విమర్శించింది. ఎన్‌సిఆర్‌బి నివేదిక ప్రకారం 2014-2022లో లక్ష మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపింది. ఈ మేరకు ఎస్‌కెఎం బుధవారం ప్రకటన విడుదల చేసింది.

2022-23 సంవత్సరానికి సంబంధించి అకౌంట్స్ ఎట్ ఎ గ్లాన్స్ అనే శీర్షికతో కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం 2018-19 నుండి గత ఐదేళ్లలో రూ.1,05,543.71 కోట్లు సరెండర్ చేసిందని ప్రకటన తెలిపింది. 2018-19లో వ్యవసాయ మంత్రిత్వ శాఖకు మొత్తం కేటాయింపులు రూ.54 వేల కోట్లు. ఆ ఏడాది రూ.21,043.75 కోట్లు సరెండర్ చేసింది. తరువాతి సంవత్సరాల్లో 2019-20లో రూ.34,517.7 కోట్లు, 2020-21లో రూ.23,824.53 కోట్లు, 2021-22లో రూ.5,152.6 కోట్లు, 2022-23లో రూ.21,005.13 కోట్లు సరెండర్ చేసింది. వ్యవసాయం, పశుసంవర్ధక, ఆహార ప్రాసెసింగ్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా నిధుల సరెండర్ ప్రభావం ఈశాన్య రాష్ట్రాలు, షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక, షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సూచించిందని తెలిపింది.అలాగే, "2014 లోక్‌సభ ఎన్నికల్లో రైతులకు రుణభారం నుంచి విముక్తి కల్పిస్తామని బిజెపి హామీ ఇచ్చింది. మోడీ ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల బకాయిలను రూ.14.56 లక్షల కోట్లు మాఫీ చేసింది. కానీ రైతు రుణంలో ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు" అని పేర్కొంది.

మోడీ పాలనలో 1,00,474 మంది రైతులు ఆత్మహత్య

"నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక ప్రకారం నరేంద్ర మోడీ పాలన (2014-2022)లో 1,00,474 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మోడీ ప్రభుత్వానికి తిరిగి అప్పజెప్పిన సొమ్మును రైతుల కోసం వినియోగించి ఉంటే చాలా మంది ప్రాణాలు కాపాడి ఉండేవారు" అని ప్రకటన పేర్కొంది. "దేశ రైతుల ప్రయోజనాలకు ద్రోహం చేసే నిధులను వెనక్కి ఇచ్చే ఇలాంటి నేరపూరిత చర్యను ఎస్‌కెఎం తీవ్రంగా ఖండిస్తుంది. వ్యవసాయాన్ని కార్పొరేట్‌లకు అప్పగించడమే దీని వెనుక ఉన్న అసలు ఉద్దేశం" అని విమర్శించింది. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఎస్‌కెఎం తీవ్రంగా నిరసిస్తూ, కార్పొరేట్ దోపిడీని అంతం చేయడానికి, వ్యవసాయాన్ని రక్షించడానికి, దేశాన్ని రక్షించడానికి చేసే పోరాటానికి మద్దతు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. రైతులు, ప్రజల ప్రయోజనాలను కాపాడటానికి బిజెపిని శిక్షించాలని ఎస్‌కెఎం రైతులకు పిలుపునిచ్చింది.

బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ.8,500 కోట్లు

• ప్రోత్సాహక పథకానికి మంత్రివర్గం ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బొగ్గు గ్యాసిఫికేషన్ (ఇంధనీకరణ) ప్రాజెక్టుల కోసం రూ.8,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. అనంతరం నేషనల్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. దేశంలో గ్యాసిఫికేషన్ టెక్నాలజీని అవలంబించడం వల్ల సహజ వాయువు, మిథనాల్, అమ్మోనియా, ఇతర అవసరమైన ఉత్పత్తుల దిగుమతులపై దేశం ఆధారపడటం తగ్గుతుందని తెలిపారు. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల (ఎంటి) బొగ్గును గ్యాసిఫై చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. సిఐఎల్, గెయిల్ కు సంబంధించిన జెవి ద్వారా ఇసిఎల్ కమాండ్ ఏరియాలో కోల్-టు-సైన్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం, సిఐఎల్, బిహెచ్‌ఈఎల్ కు సంబంధించిన జెవి ద్వారా ఎంసిఎల్ కమాండ్ ఏరియాలో బొగ్గు నుండి అమ్మోనియం నైట్రేట్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం సిఐఎల్ ద్వారా ఈక్విటీ పెట్టుబడిని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. అలాగే, ఇండియా, డొమినికన్ రిపబ్లిక్ మధ్య జాయింట్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ కమిటీ స్థాపనకు సంబంధించిన ప్రోటోకాల్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు.

పుణేలో ఎఫ్‌టిఐఐ విద్యార్థులపై దాడికి వ్యతిరేకంగా నేడు దేశవ్యాప్త నిరసన

• ఎస్ఎఫ్ఐ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పుణేలోని ఎఫ్‌టిఐఐ విద్యార్థులపై జరిగిన ఫాసిస్టు దాడిని ఖండిస్తూ గురువారం దేశవ్యాప్త నిరసనలకు ఎస్ఎఫ్ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ పిలుపు ఇచ్చింది. విద్యార్థులపై హిందూ జన్ జాగరణ్ సంస్థ సభ్యులు చేసిన దాడిని పిరికిపంద చర్యగా ఎస్ఎఫ్ఐ విమర్శించింది. ఈ మేరకు బుధవారం ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిస్వాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. "పూణెలోని ఎఫ్‌టిఐఐ క్యాంపస్‌లోకి సాయుధులైన వ్యక్తుల గుంపు విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని దాడి చేసింది. ఎఫ్‌టిఐఐఎస్ఎ బ్యానర్‌ను కూడా గుంపు దగ్ధం చేసింది" అని తెలిపారు.

ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్ విచారణ 31కి వాయిదా

న్యూఢిల్లీ : జేఎన్‌యూ మాజీ విద్యార్థి ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు జనవరి 31కి వాయిదా వేసింది. జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం లంచ్ వరకు మాత్రమే అందుబాటులో ఉన్నందున ఈ కేసు విచారణను ఈ నెలాఖరుకు వాయిదా వేసింది. జనవరి 31కి జాబితా చేశామనీ, ఉన్నత ధర్మాసనం విచారణ చేపడుతుందని ధర్మాసనం తెలిపింది. ఖలీద్ తరపున సీనియర్ న్యాయవాది సి.యు. సింగ్ వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. అయితే లంచ్ వరకు మాత్రమే ధర్మాసనం అందుబాటులో ఉండటంతో ఈ పిటిషన్ సహా ఉపా చట్టంలోని పలు నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లన్నింటినీ అదే తేదీకి జాబితా చేసింది. బెయిల్‌ను తిరస్కరిస్తూ 2022 అక్టోబర్ 18న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఖలీద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మొదట ఈ పిటిషన్ జస్టిస్ ఎ.ఎస్.బోపన్న, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల ధర్మాసనం విచారణ చేపట్టాల్సి వుంది. అయితే గతేడాది ఆగస్ట్ 9న జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఈ పిటిషన్ విచారణ నుంచి తప్పుకున్నారు.

ఇండియా ఫోరంతోనే లౌకిక రాజ్యం

• కె రామకృష్ణ, సాంబశివరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దేశాన్ని అభివృద్ధి చేయకుండా మతతత్వం వైపు మళ్లించిందని, ఈ నేపథ్యంలో లౌకిక, ప్రజాతంత్ర పార్టీలతో కూడిన 'ఇండియా ఫోరం' ద్వారా దేశంలో లౌకికరాజ్యం సాధ్యమవుతుందని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి, కె రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓటర్ల జాబితా విడుదల చేయడంతో దేశంలో ఎన్నికల వాతావరణం వచ్చిందన్నారు. పదేళ్లుగా కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. అభివృద్ధి గురించి చెప్పడానికి ఏమీ లేక ప్రజలను పక్కదారి పట్టిస్తూ మోడీ మతం వైపు మళ్లిస్తున్నారని విమర్శించారు. సిపిఐ జాతీయ సమితి కౌన్సిల్ సమావేశాలు ఫిబ్రవరి 2, 3 తేదీల్లో హైదారాబాద్‌లో జరగనున్నాయని తెలిపారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఎపిలో జగన్ అరాచక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో మోడీ, ఎపిలో జగన్ పరిపాలనకు విలువలు, విశ్వసనీయత లేదన్నారు. జగనన్న వదిలిన బాణం అని చెప్పిన షర్మిల తిరిగి జగనన్న వైపు మళ్లి, జగన్ గుండెల్లో గుచ్చుకునేందుకు సిద్ధమైందన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి ముందుండి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి, జనసేన కూటమి కమ్యూనిస్టులను కలుపుకుని వెళ్తేనే వైసిపిని ఓడించడం సాధ్యం అవుతుందని తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంగా పాలనాపరమైన విభజన తప్ప ప్రజల మధ్య కాదనే అభిప్రాయంతో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నట్లు వివరించారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ఓబులేసు, జి ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సిహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వై చెంచయ్య, సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు పాల్గొన్నారు.





జాతి పతాక



ఎగిరింది ఎగిరింది మన జాతి పతాక ఎగిరింది
వంగింది వంగింది ఆ నింగే సలాం చేసింది
భరతావనే స్వేఛ్చా వాయువులనే పీల్చిందీ
ఆబాలగోపాలమంతా పులకించి ఆడింది

అమర వీరుల త్యాగం కాషాయమై వెలసింది
శాంతి కపోతం శ్వేత వర్ణమై నడుమ నిలిచింది
అశోకుని ధర్మ చక్రం అజేయంగా అమరింది
సర్వజన సంక్షేమం సతత హరితమై పూసింది

సర్వమత సామరస్యమై అందరి మది గెలిచింది
సకల జనుల నొకే తాటిపై ఉద్యమమై నడిపింది
వందేమాతర నినాదమై తెల్లదొరల తరిమింది
పింగళి చేతి పతాకంతో ఎర్రకోట మెరిసింది

- గుండాల నరేంద్ర బాబు,
94932 35992.

నీడను కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఉన్న జంతువుల నీడలు పక్కనే ఇచ్చాం. ఏ జంతువు నీడ ఎక్కడుందో జత చేయండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ



చెన్నూరి ఆరాధ్య,
1వ తరగతి, డే కేర్ స్కూల్,
సియాటెల్ -యు.ఎస్.ఏ.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈ అద్భుతాలకు అభినందనలు

పిల్లలు తమ చిట్టి చిట్టి చేతులతో ఎన్నో పనులు చేసేస్తారు. ఒక్కోసారి తమ శక్తికి మించి కూడా చక్కబెట్టేస్తుంటారు. అలా అద్భుత ప్రతిభ చూపిన వారిని అసాధ్యులని ముద్దుగా పిలుచుకుంటుంటాం. అలాంటి పిల్లలే వీరంతా. సంగీతం, సాహిత్యం, నృత్యం, సామాజిక సేవ, విజ్ఞానం, వ్యవసాయం, సాహసం ఇలా విభిన్న రంగాల్లో విశేష ప్రతిభ చూపిన ఈ చిన్నారులు ఈ ఏడాది 'బాల పురస్కార్' అవార్డుకు ఎంపికై ఈ జనవరి 22న అవార్డులు తీసుకున్నారు. రిపబ్లిక్ డే పరేడ్‌లో కూడా వీరు పాల్గొననున్నారు. ఈ జాబితాలో మొత్తం 19 మంది బాలబాలికలు ఉన్నారు. వారిలో మన తెలుగు రాష్ట్రాల చిన్నారులు ఇద్దరూ, వైకల్యం ఉన్నా ప్రతిభావంతంగా రాణిస్తున్న వారూ ఉన్నారు.



గణితంలో ఘటికుడు : ఛత్తీస్‌గఢ్‌కి చెందిన ఆరేళ్ల గడుగ్గాయి అర్మన్‌ని అందరూ 'గూగుల్ బాయ్' అని పిలుస్తారు. ఈ ఈడు పిల్లలంతా ఆడుతూ పాడుతూ ఉంటే అర్మన్ మాత్రం గణితం, సైన్స్‌లో విశేష ప్రతిభ చూపిస్తూ ఔరా అనిపించాడు. అతి తక్కువ వ్యవధిలో 100 కోఎఫిషియంట్‌లను అవలీలగా గుణించేశాడు. అంతేకాదు, పుస్తక రచయితగా కూడా రాణిస్తున్నాడు. 2022లో 16 నిమిషాల్లోనే 86 గణిత ప్రశ్నలను పరిష్కరించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. ఆ ఏడాదే ఆన్‌లైన్ పోటీలో 2 నుండి 20 ఎక్కాలను 8 నిమిషాల 3 సెకన్లలో చెప్పి హార్వర్డ్ వరల్డ్ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.



ప్రత్యేక ప్రతిభావంతుడు : ఏడేళ్ల అవినాష్ తివారీ, డౌన్ సిండ్రోమ్ బాధితుడు. మధ్యప్రదేశ్‌కి చెందిన అవినాష్ అనాథ్రశమంలో పెరిగాడు. రెండేళ్ల వయసులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన ఆదిత్య అవినాష్‌ని దత్తత తీసుకున్నాడు. 50 శాతం వైకల్యంతో బాధపడుతున్న అవినాష్‌ని ప్రతిభావంతుడిగా తయారుచేసి చూపించాలనుకున్నాడు ఆ తండ్రి. ఆ ప్రయత్నంలో భాగంగా విభిన్న ప్రతిభావంతుల కోసం నిర్వహించే ఒలింపిక్‌లో పాల్గొనేలా చేశాడు. ఆ తరువాత ఎవరెస్ట్ శిఖరం అధిరోహించేలా చేశాడు. ఎంతో కష్టతరమైన పర్వతారోహణని ఎన్నో అనుమతులు తీసుకుని మరీ ఈ తండ్రీ కొడుకులు ఎక్కారు. 'ఈ ప్రయాణం అవార్డుల కోసమో, రికార్డుల కోసమో కాదు. నా అవినాష్ అందరిలాంటి వాడని అందరికీ చెప్పాలనుకున్నాను. ఇలాంటి బిడ్డలు కూడా ఎన్నో గొప్ప పనులు చేస్తారని ఈ ప్రపంచానికి చూపాలనుకున్నాను' అని పర్వతారోహణ పూర్తి చేసిన సందర్భంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆకాష్ మాట్లాడారు. నిజమే కదా! ఇప్పుడు అవినాష్ ఎంతోమంది డౌన్ సిండ్రోమ్ బిడ్డల తల్లిదండ్రుల కొత్త ఆశలకు కారణమయ్యాడు.



చిన్న వయసు పెద్ద మనసు : గుజరాత్‌కి చెందిన 13 ఏళ్ల హేతవీ సెరెబ్రల్ పాల్సీతో బాధపడుతోంది. అయితేనేం డ్రాయింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరుస్తోంది. 250 పెయింటింగ్‌లను చేతితో సునాయాసంగా వేసేసింది. అంతేకాదు, వైకల్య బాధితురాలిగా తను పొందే పింఛను సొమ్మును తనలాంటి పిల్లల పోషణ కోసం ఖర్చు చేస్తోంది. ఇంత చిన్న వయసులో ఎంత పెద్ద మనసు! ప్రతిభతో పాటు సాటివారి పట్ల ఇంత కరుణ చూపిస్తున్న ఈ చిన్నారి వైకల్యం.. ప్రతిభకే కాదు, మానవత్వానికీ అడ్డు కాదని నిరూపించింది.

ఎందరికో విద్యా ప్రకాశం : హార్యానాకు చెందిన 9 ఏళ్ల గరీమా అంధురాలు. పుట్టుకతోనే చూపు కోల్పోయిన గరీమా సామాజిక సేవలో ముందుంటోంది. పేదరికం కారణంగా, అంధత్వం కారణంగా పిల్లలు చదువుకు దూరం కాకూడదని 'సాక్షార్ పాఠశాల' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తోంది. దాని ద్వారా ఎంతోమంది పిల్లలను చదివిస్తోంది. చూపు లేకపోతేనేం ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపుతోన్న గరీమా సేవకు ఈ బాలపురస్కారం ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.



సామాజిక చైతన్య జ్యోత్స్న : జ్యోత్స్నది త్రిపుర. తన ప్రాంతంలో అత్యధికంగా జరిగే బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేస్తున్నందుకు 16 ఏళ్ల జ్యోత్స్నకి అవార్డు లభించింది. 'నా కంటే రెట్టింపు వయసున్న, అప్పటికే వివాహమై పిల్లలున్న వ్యక్తితో నా పెళ్లి నిర్ణయించారు. ఆ పెళ్లి నాకు ఇష్టం లేదు. 'చదువు కోవాలి, ఉద్యోగం చేయాల'ని ఆశపడ్డాను. అందుకే ఆ పెళ్లిని అంగీకరించలేదు. పెద్దలను ఎదిరించాను. పోలీసులతో చెప్పాను. ఇంత ధైర్యం ఎలా వచ్చిందో తెలియదు' అంటున్న గరీమా తన పెళ్లినే కాదు, ఆ తరువాత ఎన్నో బాల్యవివాహాలను అడ్డుకుంది. వార్తల్లో వ్యక్తిగా నిలిచింది.

ఆటల్లో మేటి : ఆదిత్యా యాదవ్ బధిరురాలు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన ఈ 12 ఏళ్ల అమ్మాయి బ్యాడ్మింటన్ ఆటలో విశేష ప్రతిభ కనబరుస్తోంది. ఎన్నో టోర్నమెంట్లల్లో, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని నైపుణ్య క్రీడాకారిణిగా రాణిస్తోంది. ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకుంటోంది.

ఇంకా ... ఢిల్లీకి చెందిన సుహానీ చౌహాన్ సోలార్‌తో నడిచే 'ఎస్ఒ-ఎపిటి' అనే వాహనాన్ని ఆవిష్కరించింది. దీనిద్వారా విత్తనాలు చల్లడం, పంటకు నీరు పెట్టడం వంటి వ్యవసాయ పనులు చేసేలా డిజైన్ చేసింది. రాజస్తాన్‌కి చెందిన ఆర్యన్ సింగ్ అధునాతన టెక్నాలజీతో 'అగ్రోబోట్' ఆవిష్కరించాడు. 'ఎఐ' శక్తితో నడిచే ఈ రోబోట్ వ్యవసాయ పనుల్లో రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. కాశ్మీర్ బాలుడు 13 ఏళ్ల ఇస్తాఫ్ హమీద్ సంగీతంలో, బీహార్‌కి చెందిన 16 ఏళ్ల ఎండి.హుస్సేన్ చేతితో అందమైన కళాకృతులు చేయడంలో విశేష ప్రతిభ కనబర్చారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అవార్డులు అందుకున్నారు. వెయ్యికి పైగా వీధి కుక్కలను, దాదాపు 800 పాములను రక్షించినందుకు అస్సాం బాలుడు శ్యామ్ ముజుందర్ 10 ఏళ్లకే ఈ అవార్డు అందుకుంటున్నాడు. చెస్‌లో అద్భుత ప్రతిభ చూపిస్తున్న, కర్నాటకకు చెందిన 9 ఏళ్ల చార్వీ కూడా బాలపురస్కార్ అందుకుంటున్నాడు. ఇంకా అరుణాచల్ ప్రదేశ్‌కి చెందిన బాడ్మింటన్ క్రీడాకారిణి జెస్సికా నేయి సారింగ్, మణిపూర్‌కి చెందిన 17 ఏళ్ల లింథోయ్ ఛానాంబమ్ క్రీడారంగం నుండి ఎంపికయ్యారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన 8 ఏళ్ల అనుష్క పాఠక్, పశ్చిమబెంగాల్ నుండి 13 ఏళ్ల అర్జిత్ బెనర్జీకి సాహిత్యరంగం నుండి ఈ పురస్కారం లభించింది. మొత్తం విద్యార్థులు అవార్డు కార్యక్రమానికి హాజరైతే మహారాష్ట్రకి చెందిన 12 ఏళ్ల ఆదిత్య విజయ్ బ్రహ్మణి అక్కడ కనిపించలేదు. సాహసబాలుడిగా ఆ అవార్డు అందుకోవడానికి అతను జీవించి లేడు. కళ్లముందే తన సోదరులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుంటే వాళ్లని రక్షించేందుకు నదిలో దిగి ఒడ్డుకు చేర్చాడు. తను మాత్రం కొట్టుకుపోయాడు. ఈ సంఘటన వివరిస్తూనే అతని పేరు మీద బాలపురస్కారం అందించారు.

తెలుగు రాష్ట్రాల చిన్నారులు



మన రాష్ట్రంలో అనంతపురం జిల్లాకు చెందిన ఆర్ సూర్యప్రసాద్ కూడా ఈ జాబితాలో ఉన్నాడు. 9 ఏళ్ల వయసులో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. 5 ఏళ్ల నుండే పర్వతాలు ఎక్కడం ప్రారంభించిన సూర్య రెండు తెలుగురాష్ట్రాల్లో ఈ ప్రతిభ సాధించిన మొదటి వాడుగా గుర్తింపబడ్డాడు. అంతేకాదు, చిన్న వయసులో కిలిమంజారోలోని ఉహ్రు శిఖరం అధిరోహించిన రెండవ భారతీయుడుగా చరిత్రసృష్టించాడు. 2021లో బెంగుళూరులో నిర్వహించిన తైక్వాండో ఒలింపిక్స్‌లో అండర్-20 కేటగిరీలో తల పడి బంగారు పతకం సాధించాడు. తండ్రి శివప్రసాద్ రైతు, తల్లి ప్రమీల గృహిణి.



పెండ్యాల లక్ష్మీ ప్రియ : తెలంగాణకు చెందిన లక్ష్మీ ప్రియకు కూచిపూడి నృత్యంలో విశేష ప్రతిభ చూపిస్తున్నందుకు ఈ అవార్డు ప్రదానం చేశారు. 14 ఏళ్లకే 200 ప్రదర్శనలిచ్చిన లక్ష్మీ ప్రియ ప్రస్తుతం 10వ తరగతి చదువుతోంది. గతేడాది జనవరిలో భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి కళా ఉత్సవాల్లో ప్రథమ బహుమతి అందుకుంది.

ఓటుకు సాటి లేదు

భారత ఎన్నికల సంఘం

జనవరి 25, 2024

14వ జాతీయ ఓటర్ల దినోత్సవం

సందర్భంగా 96 కోట్ల మంది ఓటర్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నది.

ముఖ్య అతిథి
శ్రీమతి ద్రౌపది ముర్ము
గౌరవనీయులైన భారత రాష్ట్రపతి

గౌరవ అతిథి
శ్రీ అర్జున్ రామ్ మేఘవాల్
గౌరవనీయులైన కేంద్ర న్యాయ శాఖా సహాయమంత్రి (ఇన్‌ఛార్జ్)



కార్యక్రమ వివరాలు :
- ఉత్తమ ఎన్నికల విధానాలు, పురస్కారాలు
- 2024 పార్లమెంటు ఎన్నికల ప్రచారపు లోగో మరియు ట్యాగ్‌లైన్ ఆవిష్కరణ
- పోస్టల్ స్టాంపు విడుదల
- ఓటరు అవగాహన లఘు చిత్రం ప్రదర్శన
- 2024 పార్లమెంటరీ ఎన్నికలు, భారత ఎన్నికల సంఘం సన్నాహక చర్యలు పుస్తకపు మొదటి ప్రతి ఆవిష్కరణ

CELEBRATING 12 లక్షల పోలింగు కేంద్రాలలో..

ఓటుకు సాటి లేదు, నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను.

QR కోడ్ ని స్కాన్ చేయండి ఓటరు ప్రతిజ్ఞను తీసుకోండి
ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యంలో మీ ప్రతిజ్ఞను నమోదు చేయండి. మరియు # ఖచ్చితంగా ఓటు వేయండి అని మీ సోషల్ మీడియాలో షేర్ చేయండి.

CBC 52101/13/0018/2324

Follow us on: fb.com/ECI @ecisveep youtube.com/eci @ecisveep Election Commision of India

Voter Helpline App Voter Helpline 1950

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68